www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

మంగళవారం 2 డిసెంబర్ 2025

సంగారెడ్డి సంచిక : 95 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## దూసుకెళ్తోన్న బుల్.. కొత్త రికార్డుల్లో సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారాన్ని ఉత్సాహంగా ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోత అంచనాలు, దేశీయంగా కొనుగోళ్ల అండతో బుల్ దూసుకెళ్తోంది. దీంతో సూచీలు కొత్త రికార్డుల్లో పరుగులు పెడుతున్నాయి. సెన్సెక్స్ 86వేల మార్క్ దాటగా.. నిఫ్టీ 26,300 పైన కదలాడుతోంది. ఉదయం 9.40 గంటల ప్రాంతంలో సెన్సెక్స్ (%ావఅంవఇ%) 383 పాయింట్లు ఎగబాకి 86,089 వద్ద నిఫ్టీ 108 పాయింట్ల లాభంతో 26,311 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. నిఫ్టీలో ఎస్‌బీఐ, ట్రెంట్, శ్రీరామ్ ఫైనాన్స్, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ రాణిస్తుండగా.. టెక్ మహీంద్రా, టాటా కన్జూమర్, టైటాన్ కంపెనీ, బజాజ్ ఫైనాన్స్ ఒత్తిడికి గురవుతున్నాయి.



## ప్రాణాలు పోతుంటే చర్యలు తీసుకోరా?

- గాలి నాణ్యత కారణంగా లక్షల సంఖ్యలో ప్రజలు అనారోగ్యానికి గురవుతుంటే సుప్రీంకోర్టు చూస్తూ ఉండాలా
- పంట వ్యర్థాల కాల్చివేత ఒక్కటే ఈ సమస్యకు కారణం కాదని అది కేవలం ఇందులో ఒక భాగమే
- ఈ సమస్యకు కారణమైతే కోవిడ్-19 సమయంలో మనం ఆకాశంలోని నక్షత్రాలను చూడగలిగేవారిమా?
- ఢిల్లీ వాతావరణ కాలుష్యం కేవలం పంట వ్యర్థాల వల్ల ఏర్పడింది కాదు
- దీనిని నిర్మూలించడానికి మీరు తీసుకున్న చర్యలేంటో చూపండి".

## మీది ప్రజాపాలనా? తెలంగాణ ద్రోహుల పాలనా

- సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం
- కేసీఆర్ పోరాడి స్థానికులకు 95 శాతం రిజర్వేషన్లు సాధించారు
- జెన్‌కో సంస్థలో తెలంగాణ ఉద్యమాన్ని సమైక్యవాది కుమార్ రాజా అవమానిస్తే.. విద్యుత్ ఉద్యోగులు అతన్ని తరిమితరిమి కొట్టారు.
- బీఆర్ఎస్ అధికారంలో ఉండగా 1600 మెగావాట్లకు ఒప్పందం జరిగింది
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన 2400 మెగావాట్లపై ఒప్పందం కోసం ఎన్టీపీసీ కోరింది



హైదరాబాద్

నీది ప్రజాపాలననా.. తెలంగాణ ద్రోహుల పాలననా అని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ శాఖలో మొత్తం ఉన్నతాధికారులుగా తెలంగాణ ద్రోహులనే నియమిస్తుందని మండిపడ్డారు. ఆ పోస్టులకు తెలంగాణలో సమర్థవంతమైన అధికారులే మీకు దొరకడం లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ పోరాడి స్థానికులకు 95 శాతం రిజర్వేషన్లు సాధించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ శాఖలోని పై పోస్టుల్లో ఆంధ్రావాళ్లనే నియమించారని తెలిపారు. జెన్‌కో హైడల్ అండ్ థర్మల్ డైరెక్టర్‌గా రాజశేఖర్ రెడ్డిని తీసుకున్నారని తెలిపారు. రాజశేఖర్ రెడ్డి సింగరేణిలో పనిచేసి రిటైర్ - మిగతా 3లో

## మేడారం అభివృద్ధిపై ఫోకస్

- మేడారం ఆలయ అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు
- గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దు
- ఆలయ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దు
- మేడారం ఆలయ నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దు
- గద్దెల సమీపంలో వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి



హైదరాబాద్

మేడారం ఆలయ అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆలయ పనులపై జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయ పనులపైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు అధికారులు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు సీఎం రేవంత్‌రెడ్డి. గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఆలయ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దని సూచించారు. మేడారం ఆలయ నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దని ఆదేశించారు. గద్దెల సమీపంలో వరద నీరు - మిగతా 3లో

## ఆర్‌బీఐ సమావేశం ఎఫెక్ట్... స్వల్ప నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

- ఆర్‌బీఐ సమావేశం ముందు ఇన్వెస్టర్ల అప్రమత్తత
- స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ
- హెవీవెయిట్ షేర్లలో లాభాల స్వీకరణ ప్రభావం
- నవంబర్ అమ్మకాలతో రాణించిన ఆటోమొబైల్ రంగం
- బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి




## సిద్ధరామయ్య నివాసంలో బ్రేక్ ఫాస్ట్ చర్చ ఎందుకు జరిగిందంటే

- డీకే శివకుమార్ కీలక వ్యాఖ్య
- మీడియా ఒత్తిడి కారణంగానే బ్రేక్ ఫాస్ట్ చర్చ జరిగిందని వెల్లడి
- సిద్ధరామయ్య, తాను సోదరుల్లా కలిసి పని చేస్తున్నామన్న ఉప ముఖ్యమంత్రి
- కర్ణాటక కాంగ్రెస్‌లో గ్రూప్‌లు అంటూ ఏవీ లేవని స్పష్టీకరణ






## డిజిటల్ అరెస్టు కేసుల్ని దర్యాప్తు చేయండి

- సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు
- అవినీతి కోణంలోనూ స్వేచ్ఛగా దర్యాప్తు చేపట్టవచ్చు
- సైబర్ నేరగాళ్లకు చెందిన మ్యూల్ అకౌంట్ల అంశంలో బ్యాంకుల పాత్రను కూడా ప్రశ్నించేందుకు సీబీఐకి కోర్టు అధికారాలు జారీ



## పార్లమెంటరీ మర్యాదలను 11 ఏళ్లుగా తుంగలో తొక్కారు..

- మోదీ వ్యాఖ్యలపై ఖర్గే
- గత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులు హడావిడిగా ఆమోదించారు
- కొన్ని బిల్లులు కేవలం 15 నిమిషాల్లో ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించారు
- మణిపూర్ వంటి కీలక అంశాలపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేంతవరకూ ప్రభుత్వం మౌనంగానే ఉండిపోయింది



## వారికి ఐఏఎస్ హోదా ఎందుకు కల్పించారు?

- రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హైకోర్టు షాక్
- తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు
- శిఖా గోయల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్రలను ఐఏఎస్ కేడర్‌లో కొనసాగించడంపై ఆగ్రహం
- డిసెంబర్ 10 లోగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు షాక్ ఇచ్చింది. పలువురు ఐపీఎస్ అధికారులను ఐఏఎస్ కేడర్‌లోకి తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. శిఖా గోయల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర వంటి ఐపీఎస్ అధికారులను ఐఏఎస్ కేడర్‌లో ఎందుకు కొనసాగిస్తున్నారో వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు - మిగతా 3లో

## విద్యాభివృద్ధి ముఖ్యం

### కేటీఆర్ అండ్ కో రెచ్చగొడుతున్నారు


### సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్



- ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావొస్తుంది
- పాలమూరు జిల్లా విద్యాపరంగా రాష్ట్రానికి మోడల్‌గా ఉండాలి
- సన్నబియ్యం, ఫ్రీ కరెంట్, ఫ్రీ బస్సు అన్నీ అమలు చేస్తున్నాం
- ఇది చాలదన్నట్లు మా ఆడబిడ్డలు పెట్రోల్ బంకులు, వెయ్యి బస్సులకు యజమానులు అయ్యారు.
- లంచం అడిగితే వీపు విమానం మోత మోగించండి
- మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం ఇచ్చిన ఘనత ప్రజా ప్రభుత్వానిది.. సన్నబియ్యం ఇస్తున్నాం
- బీసీల జనాభా 56 శాతం ఉన్న లెక్క తేల్చిన ఘనత మాది

నారాయణపేట

మక్తల్ నియోజకవర్గాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తమ హయాంలో మక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు రేవంత్. మక్తల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ‘కొడంగల్ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తాం. భూములిచ్చిన రైతులకు రూ 20 లక్షల పరిహారం ఇస్తున్నాం. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు రెండేళ్లలో పూర్తి చేయాలి. దండు కట్టండి.. దగ్గరుండి పనిచేయించుకోండి. ఎవరైనా లంచం అడిగితే వీపు విమానం మోత మోగించండి. ఇరిగేషన్‌తో పాటు విద్యకూ ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రతీ పేదబిడ్డకు చదువు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించాం. ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా కల్పించాం. పక్కనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్న - మిగతా 3లో



## ఇక్కడ డ్రామాలొద్దు

- బాధ నుంచి బయటకు రండి
- ప్రతిపక్షాలకు ప్రధాని కీలక సూచన
- వికసిత్ భారత్ లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నాం
- తమ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమే
- ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలి
- చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి

# పార్లమెంటరీ మర్యాదలను 11 ఏళ్లుగా తుంగలో తొక్కారు



**న్యూఢిల్లీ:** పరాజయాన్ని అంగీకరించే మనసు ప్రతిపక్షాలకు లేదని, వాళ్లు వ్యూహం మార్చుకుంటే కొన్ని 'టిప్స్' ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని, సభా సమయాల్లో మాత్రం డ్రామాలు వద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. పార్లమెంటరీ మర్యాదలను, పార్లమెంటరీ వ్యవస్థను గత 11 ఏళ్లుగా ప్రభుత్వం అణిచివేస్తూనే ఉందని ఆరోపించారు. గత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులు హడావిడిగా ఆమోదించారని, కొన్ని బిల్లులు కేవలం 15 నిమిషాల్లో ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించారని గుర్తుచేశారు. జీఎస్టీ, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, రైతు వ్యతిరేక చట్టాలు పార్లమెంటు ద్వారా ప్రభుత్వం బుల్డోజింగ్ చేసిన బిల్లులని ఆక్షేపణ తెలిపారు.

**నాటకీయ ప్రసంగం**

శీతాకాల సమావేశాల తొలి రోజే పార్లమెంటు ముందున్న కీలక ఆంశాల గురించి మోదీ ప్రస్తావించే బదులు నాటకీయ ప్రసంగం సాగించారని ఖర్గే తప్పుపట్టారు. 11 ఏళ్లుగా పార్లమెంటరీ మర్యాదలు, వ్యవస్థను ప్రభుత్వం అణిచివేస్తోందన్నదే అసలు నిజమని అన్నారు. మణిపూర్ వంటి కీలక అంశాలపై విపక్షాలు అవిశాస్వ తీర్మానం ప్రవేశపెట్టేంతవరకూ ప్రభుత్వం మౌనంగానే ఉండిపోయిందని, ఎన్నికల జాబితా ఎస్ఐఆర్ ప్రక్రియలో ఒత్తిడికి గురై బీఎల్ఓలు చనిపోతే ప్రభుత్వానికి ఎలాంటి పట్టింపులేదని విమర్శించారు. 'ఓటు చోరీ' వంటి కీలకాంశాలను విపక్షం లేవనెత్తుతూనే ఉంటుందని, ప్రభుత్వం డ్రామాలు కట్టిపెట్టి పార్లమెంటులో ప్రజాసమస్యలపై చర్చకు ముందుకురావాలని సూచించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానత్వం, దేశ విలువైన వనరుల లూటీ వంటివి నిజమైన ప్రజాసమస్యలనీ, అయితే అధికారంలో ఉన్న వారు అధికార దురహంకారంతో డ్రామాలాడుతున్నారని ఖర్గే విమర్శించారు. బిహార్ ఓటమి నుంచి వాళ్లు (విపక్షాలు) బయటకు రావడం లేదంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై మాట్లాడుతూ, ప్రతికూల ధోరణి రాజకీయాల్లో పనికొస్తుందే కానీ జాతి నిర్మాణానికి సానుకూల ఆలోచనా దృక్పథం అవసరమని, ప్రతికూలతా ఆలోచలను ప్రభుత్వం పక్కనపెట్టి జాతినిర్మాణంపై దృష్టి సారించాలని హితవు పలికారు.


# 'ఇదేమీ నాటకం కాదు' ప్రధాని మోదీపై ప్రియాంక ఫైర్






**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభంలోనే అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ప్రధాని నరేంద్ర మోదీ సభలో 'డ్రామా'కు కాకుండా, 'డెలివరీ' (పని)కి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతిపక్షాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఎదురుదాడి చేశారు. పార్లమెంటు సమావేశాలకు ముందు ప్రధాని మోదీ తన ప్రసంగంలో.. ప్రతిపక్షాలు తమ పాత వ్యూహాలను మార్చుకోవాలని, చర్చలకు అవకాశం ఇవ్వాలని సూచించారు. 'డ్రామా కాదు, డెలివరీ ఉండాలి.. నినాదాలు కాదు, విధానాలకు ప్రాధాన్యత నివ్వాలి' అని అన్నారు. తొలిసారిగా ఎన్నికైన ఎంపీలకు మాట్లాడే అవకాశం రావడం లేదని, డ్రామా చేయడానికి పార్లమెంట్ సరైన వేదిక కాదని ఆయన ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ప్రియాంక గాంధీ.. ఢిల్లీలో వాయు కాలుష్యం, ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తదితర క్లిష్టమైన సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తడం నాటకం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల పరిస్థితులు, ఎస్ఐఆర్, కాలుష్యం మొదలైనవి చాలా పెద్ద సమస్యలని, వాటిపై చర్చిద్దామని ప్రియాంకా గాంధీ అన్నారు. పార్లమెంటు ఉన్నది దేనికి?.. నాటకాలకు కాదు. సమస్యలపై మాట్లాడటం, లేవనెత్తడం నాటకం కాదని ఆమె అన్నారు. సభలో ప్రజా సమస్యలపై చర్చలకు అనుమతించడం లేదంటూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. కాగా ఈ శీతాకాల సమావేశాలు కేవలం 15 రోజులు మాత్రమే జరగడంపై ప్రతిపక్షాలు ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేశాయి. ప్రభుత్వం కావాలనే సమావేశాలను తగ్గించి, శాసనసభ చర్చలను అణిచివేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించాయి. ప్రభుత్వం 14 బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ సమస్యలు, బీఎల్ఓ ఆత్మహత్యలు, ఢిల్లీ ఉగ్ర దాడి, జాతీయ భద్రతా అంశాలపై చర్చలకు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో పార్లమెంట్‌లో రాజకీయ వేడి మరింతగా పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# సిద్ధరామయ్య నివాసంలో బ్రేక్ ఫాస్ట్ చర్చ ఎందుకు జరిగిందంటే



ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో బ్రేక్‌ఫాస్ట్ చర్చలకు ఎందుకు కూర్చున్నామనే విషయాన్ని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వివరించారు. మీడియా ఒత్తిడి కారణంగానే తాము కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. "మరి మీరు సిద్ధరామయ్యను ఎప్పుడు బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానిస్తున్నారు?" అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, అది తమ ఇద్దరికి సంబంధించిన విషయమని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. అధిష్ఠానం సూచనల మేరకు సిద్ధరామయ్య మూడు రోజుల క్రితం ఉప ముఖ్యమంత్రిని బ్రేక్‌ఫాస్ట్ చర్చకు ఆహ్వానించారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. సిద్ధరామయ్య స్థానంలో డీకే శివకుమార్‌కు అవకాశం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి వర్గం కోరుతున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. కర్ణాటక కాంగ్రెస్, ప్రభుత్వంలో రెండు వర్గాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ ఈరోజు స్పందించారు. సిద్ధరామయ్య, తాను సోదరుల్లా కలిసి ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో లేదా ప్రభుత్వంలో సిద్ధరామయ్య గ్రూప్ లేదా డీకే శివకుమార్ గ్రూప్ అంటూ ఏమీ లేవని స్పష్టం చేశారు. మీడియా మాత్రం కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో గ్రూప్‌లు ఉన్నట్లు ప్రచారం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా ఒత్తిడి వల్లే తాము ఇటీవల బ్రేక్‌ఫాస్ట్ చర్చలు జరిపామని తెలిపారు. "సిద్ధరామయ్య గ్రూప్, డీకే శివకుమార్ గ్రూప్, మరో గ్రూప్ అంటూ మీడియా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన బ్రేక్‌ఫాస్ట్ చర్చల్లో పార్టీ గురించి మాట్లాడుకున్నాం. దీని గురించి మీడియా ఆలోచించకపోవడం మంచిది" అని డీకే శివకుమార్ అన్నారు.

# ఇక్కడ డ్రామాలొద్దు..



**న్యూఢిల్లీ :** బిహార్ ఓటమి నుంచి ఇంకా బయటకు రాలేదంటూ ప్రతిపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ చురకలంటించారు. ఓటమి బాధ నుంచి బయటకు రావాలంటూ ఇండి కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన సూచించారు. మీ బాధ్యతను మీరు నిర్వర్తించండంటూ ఆయా పార్టీలకు ప్రధాని హితవు పలికారు. పార్లమెంటులో బలమైన అంశాలతోపాటు ప్రశ్నలు లేవనెత్తండంటూ వారికి కీలక సూచన చేశారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం అంటే ఈ రోజు నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ సమావేశాలకు ముందు సభ్యులను ఉద్దేశించి పార్లమెంట్ ఎదుట ప్రధాని మోదీ ప్రసంగించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి అని వివరించారు. అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని తాను ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.

బిహార్ ఎన్నికల్లో ప్రజలు అత్యధిక ఓటింగ్‌తో ప్రజాస్వామ్యాన్ని బలపరిచారు. పదేళ్లుగా వీళ్లు ఆడుతున్న డ్రామాలను దేశం నమ్మడం లేదు. పరాజయాన్ని కూడా అంగీకరించే మనసు విపక్షాలకు ఉండడం లేదు. అయితే మీ ఓటమి, నిరాశలకు సమావేశాలను బలి కానివ్వొదు. డ్రామాలు ఆడేందుకు వేరే వేదికలు ఉన్నాయి. చట్ట సభల్లో వద్దు. వికసిత్ భారత్‌కు లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. కాబట్టి మీ సలహాలు, సూచనలు మాత్రమే ఇవ్వండి.. సమస్యలను గళం వినిపించేందుకు ఎంపీలకు అవకాశమే దొరకడం లేదు. తొలిసారి సభలో అడుగుపెట్టిన వారికి మాట్లాడే అవకాశం ఇవ్వండి. సభ సజావుగా సాగేందుకు సహకరించండి. దేశం కోసం పార్లమెంట్ ఏం చేస్తుందో తెలియజేయండి. ఈ పార్లమెంట్ సమావేశాల్లో అర్థవంతమైన చర్చ జరుగుతుందని ఆశిస్తున్నా అంటూ మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

సోమవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఇవి ఈనెల 19వ తేదీ వరకు కొనసాగుతాయి. సెలవు రోజులు మినహా మొత్తం 15 రోజులపాటు ఈ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు ఆమోదం పొందనున్నాయి.

ఆదివారం అఖిలపక్షం.. ఈ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను కేంద్రం కోరింది. ఆదివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన న్యూఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ భేటీ అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. పార్లమెంట్ సజావుగా సాగేందుకు సహకరించాలని, ఆటంకాలు సృష్టించ వద్దని విపక్షాలను కోరామన్నారు. దాదాపు గంటన్నర పాటు ఈ అఖిలపక్ష భేటీ జరిగింది. ఈ భేటీలో విపక్షాల డిమాండ్లు విన్నారేగానీ ఏమాత్రం స్పందించలేదని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఉపనేత గౌరవ్ గొగోయ్ మండిపడ్డారు.

ఈ అఖిల పక్ష సమావేశానికి కేంద్ర మంత్రులు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘవాల్, ఎల్.మురుగన్, అనుప్రియ పటేల్‌తోపాటు జైరామ్ రమేశ్ (కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టీడీపీ), మిథున్‌రెడ్డి (వైసీపీ), సురేశ్‌రెడ్డి (బీఆర్ఎస్), బాలశౌరి (జనసేన) సహా 36 పార్టీల నుంచి దాదాపు 50మంది నేతలు పాల్గొన్నారు. కృష్ణా జలాల వినియోగం, కేటాయింపులపై పార్లమెంట్‌లో చర్చించాలని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల అంశాన్ని పరిష్కరించాలని కేంద్రాన్ని కోరినట్లు బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్ తెలిపారు.

## ప్రాణాలు పోతుంటే చర్యలు తీసుకోరా?




ఢిల్లీ వాతావరణ కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. దేశ రాజధానిలో గాలి కాలుష్యాన్ని తగ్గించడానికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని నొక్కిచెప్పింది. గాలి నాణ్యత కారణంగా లక్షల సంఖ్యలో ప్రజలు అనారోగ్యానికి గురవుతుంటే సుప్రీంకోర్టు చూస్తూ ఉండాలా అని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ని ప్రశ్నించింది.

ఢిల్లీలో గాలి కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. గాలి నాణ్యత ఎంత తీవ్ర ప్రమాదకర స్థాయికి చేరుతుంటే ఎటువంటి చర్యలు తీసుకొంటున్నారని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ తో పాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ ను ప్రశ్నించింది. వాయు కాలుష్యంతో లక్షల మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటే సుప్రీం కోర్టు చూస్తూ ఉండాలా అని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. పంట వ్యర్థాల కాల్చివేత ఒక్కటే ఈ సమస్యకు కారణం కాదని అది కేవలం ఇందులో ఒక భాగమేనని తెలిపింది. జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ "సుప్రీంకోర్టు ఈ సమస్యపై చూస్తూ ఉండలేదు. "పంటవ్యర్థాల కాల్చివేత ఈ సమస్యకు కారణమైతే కోవిడ్-19 సమయంలో మనం ఆకాశంలోని నక్షత్రాలను చూడగలిగేవారిమా? ఈ సమస్యను రాజకీయంగా చూడకూడదు. ఢిల్లీ వాతావరణ కాలుష్యం కేవలం పంట వ్యర్థాల వల్ల ఏర్పడింది కాదు. దీనిని నిర్మూలించడానికి మీరు తీసుకున్న చర్యలేంటో చూపండి". అని చీఫ్ జస్టిస్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ని ప్రశ్నించారు. ఈ సమస్యను పరిష్కరించే అంశం కోర్టుల పరిధిలోనిది కాదని నిపుణులతో కూడిన కమిటీ వాయు కాలుష్య సమస్యకు పరిష్కారం కనుగొనాలని తెలిపారు. కోర్టులు ఈ సమస్యలను రూపుమాపవు కాని దానికి కావాల్సిన వేదికను ఏర్పాటు చేయగలవు. అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. గాలి కాలుష్యాన్ని పరిష్కరించడానికి స్పష్టమైన సమయాన్ని నిర్దేశించుకొని తగిన ప్రణాళిక రూపొందించాలని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా పేర్కొంది.

## డిజిటల్ అరెస్టు కేసుల్ని దర్యాప్తు చేయండి




**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు ఇవాళ సంచలన ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ అరెస్టు స్కామ్ కేసుల్లో .. దర్యాప్తు చేపట్టాలని సీబీఐని ఆదేశించింది. అవినీతి కోణంలోనూ స్వేచ్ఛగా దర్యాప్తు చేపట్టవచ్చు అని కోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. సైబర్ నేరగాళ్లకు చెందిన మ్యూల్ అకౌంట్ల అంశంలో బ్యాంకుల పాత్రను కూడా ప్రశ్నించేందుకు సీబీఐకి కోర్టు అధికారాలు జారీ చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చి ఈ కేసులో స్పందించారు. ఇప్పటి వరకు జరిగింది చాలు అని, డిజిటల్ అరెస్టు స్కామ్‌లను తక్షణమే సీబీఐ దర్యాప్తు చేయాలని ధర్మాసనం కోరింది. ఇప్పటి వరకు బాధితుల నుంచి సైబర్ నేరగాళ్లు సుమారు 3 వేల కోట్ల అక్రమాలకు పాల్పడినట్లు సుప్రీంకోర్టుకు కేంద్రం వెల్లడించిన విషయం తెలిసిందే. డిజిటల్ అరెస్టులపై దాఖలైన సుమోటో కేసులో ధర్మాసనం ఆదేశాలు జార చేసింది. నకిలీ అకౌంట్లను గుర్తించేందుకు ఏఐ మెషీన్ టూల్స్ పట్ల అవగాహన కల్పించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సుప్రీం కోరింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన సైబర్ క్రైం యూనిట్లు సమర్థవంతంగా పనిచేయాలని, ఎటువంటి అవరోధాలు ఎదురైనా కోర్టుకు తెలియజేయాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ-మెయిల్ ద్వారా సమాచారన్ని చేరవేయవచ్చు అని కోర్టు చెప్పింది. విదేశాల్లో ఉన్న నేరస్థులను పట్టుకునేందుకు ఇంటర్‌పోల్ సహాయం తీసుకోవాలని కూడా కోర్టు సూచించింది.

## ఆర్‌బీఐ సమావేశం ఎఫెక్ట్... స్వల్ప నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ఈ వారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం జరగనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. దీనికి తోడు హెవీవెయిట్ షేర్లలో లాభాల స్వీకరణ జరగడంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైనప్పటికీ, ఆ జోరును చివరి వరకు కొనసాగించలేకపోయాయి. టేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 64.77 పాయింట్ల నష్టంతో 85,641.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27.20 పాయింట్లు కోల్పోయి 26,175.75 వద్ద ముగిసింది. రెండో త్రైమాసికం జీడీపీ వృద్ధి మెరుగ్గా నమోదు కావడం, రూపాయి విలువ బలహీనపడటంతో డిసెంబర్‌లో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు తగ్గాయని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో మార్కెట్లు ఒక రేంజ్‌కే పరిమితమయ్యాయని వారు పేర్కొన్నారు. దీనికి తోడు నవంబర్‌లో జీఎస్టీ వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం కూడా సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. అయితే, ఆటోమొబైల్ రంగం మాత్రం రాణించింది. నవంబర్‌లో బలమైన అమ్మకాలు, పెళ్లిళ్ల సీజన్ డిమాండ్ వంటివి ఈ రంగానికి కలిసొచ్చాయి. నిఫ్టీ ఆటో సూచీ 0.25 శాతం పెరిగింది. మరోవైపు, నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ రంగాలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 0.39 శాతం లాభపడింది. ప్రధాన షేర్లలో బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నష్టపోగా.. టాటా మోటార్స్, మారుతీ సుజుకీ, కోటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఫ్లాట్‌గా ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.25 శాతం లాభంతో సెషన్‌ను ముగించింది.

## బెంగాల్‌లో పోలింగ్ బూత్ స్థాయి అధికారుల నిరసన.. 'సర్' పని ఒత్తిడిపై ఆందోళన

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) విధులు నిర్వహిస్తున్న పోలింగ్ బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వో) భారీ నిరసన చేపట్టారు. పని ఒత్తిడి, పని పరిస్థితులు, మానసిక ఆరోగ్యంపై ఆందోళన చెందారు. బీఎల్‌వో అధికార్ రక్షా కమిటీ నేతృత్వంలో సోమవారం మధ్యాహ్నం కోల్‌కతాలోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం వెలుపల భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. 'సర్' విధుల వల్ల ఒత్తిడి, పని పరిస్థితులు, మానసిక ఆరోగ్య పరిస్థితుల వల్ల కొందరు బీఎల్‌వోలు ఆత్మహత్యలకు పాల్పడటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు వారు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాగా, సోమవారం ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో శాసనసభ్యుల బృందంతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీకి చెందిన ప్రతిపక్ష నేత సువేందు అధికారి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు అక్కడకు చేరుకున్నారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా 'వెనక్కి వెళ్లిపోండి' అంటూ నిరసన చేస్తున్న బీఎల్‌వోలు బీజేపీ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు బీజేపీ కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. నిరసన చేస్తున్న బీఎల్‌వోలకు ప్రతిగా నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొన్నది. అయినప్పటికీ బీజేపీ నేతలు

# విద్యాభివృద్ధి ముఖ్యం

-మొదటిపేజీ తరువాయి

పక్కనే ఉన్న పంట పొలాలకు నీళ్లు ఇవ్వాలని సోయి 70 ఏళ్లుగా పాలకులు లేకుండా పోయింది.
ఆ పని నేను చేస్తున్నందుకు ఇవాళ నాకు ఎంతో సంతోషంగా ఉంది. రెండేళ్లలో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి కావాలి. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం ఇచ్చిన ఘనత ప్రజా ప్రభుత్వానిది. సన్నబియ్యం ఇస్తున్నాం. బీసీల జనాభా 56 శాతం ఉన్న లెక్క తేల్చిన ఘనత మాది. గ్రామపంచాయితీ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలి. అభివృద్ధి ఆకాంక్షించే వారిని సర్పంచ్‌గా గెలిపించాలి' అని సీఎం రేవంత్ సూచించారు

**మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోలేదు..**

ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన తర్వాత కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు.

**ఆటోడ్రైవర్లను రెచ్చగొడుతున్నారు..**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే.. ఆటోడ్రైవర్లను మాజీ మంత్రి కేటీఆర్ అండ్ కో రెచ్చగొట్టి తమ మీదకు పంపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు సీఎం. తమ ప్రభుత్వంలో పేదలకు కూడా సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తుచేశారు. మహిళలను వ్యాపార వేత్తలుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. దేశానికి, రాష్ట్రానికి పాలమూరును ఆదర్శంగా మారుస్తామని వివరించారు. ఎన్ని నిధులు కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధమని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వంలో ఇరిగేషన్‌తో పాటు ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి పేద బిడ్డకు చదువు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూళు ప్రారంభించామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**పాలమూరు గడ్డ ప్రేమిస్తే ప్రాణం ఇస్తుంది...**

'గత పాలకుల నిర్లక్ష్యానికి బలైన మక్తల్ నుంచి ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు ప్రారంభించడం నాకు చాలా



సంతోషంగా ఉంది. ఇప్పటిదాకా మక్తల్ నారాయణపేట కొడంగల్‌కు సాగునీరు ఇవ్వాలని ఎవ్వరికీ అనిపించలేదు. కానీ 12 మందిని మీరు ఆశీర్వదించి పంపిస్తే నాకు ఇక్కడి ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చింది. మన కష్టాలను తీర్చేందుకు ఎవ్వరూ బాధ్యత తీసుకోలేదు. కానీ మీ సోదరుడిగా.. మీతో పాటు పెరిగిన బిడ్డగా సీఎంగా వచ్చాను. పాలమూరు గడ్డ ప్రేమిస్తే ప్రాణం ఇస్తుంది. కానీ మోసగిస్తే పాతాళానికి తొక్కింది.. ఇది కేసీఆర్ విషయంలో జరిగింది. గతంలో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి.. సీఎంగా చేస్తే.. మన జిల్లాలో ఎలాంటి ప్రాజెక్టు పూర్తి చేయలేదు. రూ.12 కోట్లు కేటాయించి సంగంబండ రిజర్వాయర్ పూర్తి చేయలేదు. అందుకే ఎవరికో పెద్దరికం ఇవ్వొద్దని.. మన బిడ్డ సీఎంగా ఉండాలని మీరు కోరుకున్నారు. మంత్రి మండలి సహకారంతో.. ఇక్కడ అన్ని ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తున్నాం.. గతంలో జీవో నెంబరు- 69 ద్వారా వచ్చిన నారాయణపేట - కొడంగల్ ప్రాజెక్టును పక్కన పెట్టారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తున్నాం. ఇప్పటికీ కొంతమంది అడ్డంకులు పెట్టారు.. కానీ మా మంత్రి వాకిటి శ్రీహరి రైతులతో మాట్లాడి.. ఎకరానికి రూ.20 లక్షల పరిహారంతో 95 శాతం మంది రైతులు భూములు ఇవ్వడానికి ఒప్పుకోవడంతో పనులు ప్రారంభించాం. ఇది నా జీవితంలో చాలా సంతోషకరమైన విషయం. రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం.. ఈ ప్రాజెక్టుకు ఎవరైనా అడ్డుపడితే ఊరుకోం' అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

**విద్యాభివృద్ధి ముఖ్యం..**

'విద్యాభివృద్ధి కూడా ముఖ్యం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రూ. 200 కోట్లతో ఏర్పాటు చేశాం. మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ నేతలు ఇద్దరు గెలవక పోయినా 14 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ తీసుకువస్తున్నాం.. యెన్నం శ్రీనివాస్ రెడ్డి అడిగిన వెంటనే ట్రిపుల్ ఐటీ కాలేజీ తెచ్చాం.. పాలమూరు విశ్వవిద్యాలయంలో కావాల్సిన కోర్సులన్నీ తెచ్చా.. పాలమూరు జిల్లా విద్యాపరంగా రాష్ట్రానికి మోడల్‌గా ఉండాలి. సన్నబియ్యం, ఫ్రీ కరెంట్, ఫ్రీ బస్సు అన్నీ అమలు చేస్తున్నాం.. ఇది చాలదన్నట్లు మా ఆడబిడ్డలు పెట్రోల్ బంకులు, వెయ్యి బస్సులకు యజమానులు అయ్యారు. అంబానీ, అదానీలకు సమానంగా హై టెక్ సిటీలో మా అక్కలకు స్టాల్స్ వచ్చాయి. మీరు ఒక్కసారి ఆశీర్వదిస్తే ఇవన్నీ సాధ్యమయ్యాయి. అందుకే మాకు అండగా ఉన్న పాలమూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. మా మాదిగ సోదరులు వర్గీకరణ కోసం చేయని పోరాటంలేదు.. కానీ సుప్రీంకోర్టు తీర్పు వెంటనే నేను వర్గీకరణ చేసి మాల, మాదిగ పంచాయితీ లేకుండా చేసి చూపించా. బీసీ లెక్క చేసి.. దేశానికి ఆదర్శంగా నిలిచాం. సంక్షోభం దిశలో ఉన్న రాష్ట్రాన్ని సక్కగా చేస్తున్నా. గత కేసీఆర్ ప్రభుత్వంలో రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కష్టాలు పడి అప్పులు తీర్చుకుంటూ అభివృద్ధిని చేసి చూపిస్తున్నాం. కాళ్లల్లో కట్టెలు పెట్టే వారిని సర్పంచులుగా గెలిపిస్తే.. మళ్లీ అడ్డంకులు సృష్టిస్తారు. డిసెంబరు 8, 9వ తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ పెట్టుకుని.. మన తెలంగాణ రాష్ట్ర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుదాం. ఇన్ని చేస్తుంటే.. మీరు సర్పంచులుగా వేరే వారిని గెలిపిస్తే.. అభివృద్ధిని అడ్డుకుంటారు. పార్టీలను పదేళ్లు పక్కన పెడదాం.. మన పాలమూరును అభివృద్ధి చేసుకుందాం. ఈ గడ్డ దేశానికి జైపాల్‌రెడ్డి లాంటి నాయకుడిని.. మనకు బూర్గుల రామకృష్ణారావు లాటి తొలి సీఎంను ఇచ్చింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే మమ్మల్ని గెలిపించారో.. ఇప్పుడు సర్పంచులుగా కాంగ్రెస్ నేతలను ఆశీర్వదించి.. మన ప్రభుత్వ అభివృద్ధిని కొనసాగించాలి. మీ అందరి ఆశీర్వాదం తీసుకుని తెలంగాణ రాష్ట్రం మొత్తం తిరుగుతా' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# మీది ప్రజాపాలనా? తెలంగాణ ద్రోహుల పాలనా

-మొదటిపేజీ తరువాయి

అయ్యాడని.. ఆయనకు విద్యుత్ ఉత్పత్తిలో ఎలాంటి అనుభవం లేదని పేర్కొన్నారు. జెన్‌కో సంస్థలో తెలంగాణ ఉద్యమాన్ని సమైక్యవాది కుమార్ రాజా అవమానిస్తే.. విద్యుత్ ఉద్యోగులు అతన్ని తరిమితరిమి కొట్టారని తెలిపారు. అలాంటి కుమార్ రాజాను తీసుకొచ్చి నేడు విద్యుత్ ఉద్యోగుల మీద పెత్తనం చేసేందుకు డైరెక్టర్‌గా నియమించారని మండిపడ్డారు. ఇది ప్రజాపాలనా? తెలంగాణ ద్రోహుల పాలనా? అని ప్రశ్నించారు.
మధ్యప్రదేశ్‌లో మైనింగ్ ఇంజనీర్‌గా పనిచేసిన ఆంధ్రా ప్రాంతానికి చెందిన శివాజీని ఎస్పీడీసీఎల్‌లో కీలకమైన పోస్టులో నియమించారని హరీశ్‌రావు తెలిపారు. అనుభవజ్ఞులైన ఐదారుగురు దళిత రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు ఉన్నా ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ గడ్డపై పనిచేయని ఏపీ వ్యక్తి నర్సింహులును ఎస్పీడీసీఎల్ డైరెక్టర్‌గా పెట్టారని తెలిపారు. రెడ్కో సంస్థ సీఎండీగా ఆంధ్రా ప్రాంతానికి చెందిన జూనియర్ మోస్ట్ డీఈ వావిలాల అనీలను నియమించారని అన్నారు.
తెలంగాణలో సమర్థవంతమైన అధికారులు మీకు దొరకడం లేదా అని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు. అనేకమంది తెలంగాణ దళితబిడ్డలు సమర్థులైన అధికారులు ఉన్నారని తెలిపారు. ఇక్కడ ప్రభుత్వం తెలంగాణ వాళ్లు నడుపుతున్నారా? ఆంధ్రా పాలకులు నడుతుపున్నారా అని ప్రశ్నించారు. చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్‌గా అవినీతిపరుడైన ఆంధ్రా వ్యక్తిని నియమించారని అన్నారు. అతను గ్రీన్ ఎనర్జీ అప్లికేషన్ ఫీజు రూ.25వేల చొప్పున రూ.600 కోట్లు వసూలు చేశారని తెలిపారు. చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసు మెగావాట్‌కు రూ.25లక్షలు అడిగారని తెలిపారు. పైవాళ్లకు కూడా ఇవ్వాలని రూ.30 లక్షలకు రేటు పెంచారని అన్నారు. ఇంకా లంచాల లెక్కతేలక ఆర్నెల్ల నుంచి పెండింగ్‌లో పెట్టారని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఎలక్ట్రిసిటీ ఇన్‌స్పెక్టర్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఆంధ్రా అధికారులను తొలగించి తెలంగాణ వాళ్లకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



**అప్పులు పుట్టడం లేదంటున్న రేవంత్.. నిధులు ఎక్కడి నుంచి తెస్తారు.. ముఖ్యమంత్రిని నిలదీసిన హరీశ్‌రావు**

కాంగ్రెస్ అప్పులు, తప్పులు తెలంగాణ ప్రజలకు భారంగా మారుతున్నాయని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా తెలంగాణకు ఎన్టీపీసీ 4 వేల మెగావాట్ల ప్లాంట్ నిర్మించిందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా 1600 మెగావాట్లకు ఒప్పందం జరిగిందని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన 2400 మెగావాట్లపై ఒప్పందం కోసం ఎన్టీపీసీ కోరిందని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎన్టీపీసీ సీఎండీ మూడు సార్లు కలిశారని పేర్కొన్నారు. ఎక్కువ ధరకు ఎన్టీపీసీ నుంచి ఎందుకు కొనాలని సీఎం చెప్పారని తెలిపారు. 60 శాతం ఉన్న థర్మల్ పవర్‌ను 40 శాతానికి తగ్గిస్తామని శ్వేతపత్రం పెట్టారని గుర్తుచేశారు. కమీషన్ల కోసం ఇప్పుడు థర్మల్ పవర్ ప్లాంట్లు పెడతామంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతకాలతో గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రకటించారని అన్నారు. ఇప్పుడు గ్రీన్ ఎనర్జీని వదిలేసి థర్మల్‌కు ఎందుకెళ్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు.
ఎన్టీపీసీ నుంచి 800 మెగావాట్లకు యూనిట్‌కు రూ.4.12 ప్రకారం ఒప్పందం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. రామగుండం 800, పాల్వంచ 800, మక్తల్ 800 మెగావాట్ల ప్రతిపాదనలు పెట్టారని అన్నారు. రామగుండం ప్లాంట్‌కు జెన్కో డీపీఆర్ ఇచ్చిందని తెలిపారు. 800 మెగావాట్లకు రూ.10,800 కోట్ల ఖర్చుతో ప్రతిపాదనలు పెట్టిందని పేర్కొన్నారు. మూడు ప్లాంట్లకు కలిపి రూ.45 వేల కోట్ల ఖర్చవుతుందని చెప్పిందన్నారు. కొత్త ప్లాంట్లలో ఉత్పత్తికి యూనిట్‌కు రూ.7.70 ఖర్చవుతుందని అన్నారు. ఎన్టీపీసీ కంటే యూనిట్‌కు రూ.3 కంటే ఎక్కువ ఖర్చవుతుందని అన్నారు. సొంత ప్లాంట్లలో ఉత్పత్తి వల్ల రోజుకు 9 కోట్లు ప్రజలపై భారం పడుతుందని వివరించారు. అంటే ఏడాదికి రూ.3800 కోట్ల అదనపు భారం పడుతుంని అన్నారు. కరెంటు కొనుగోలు కోసం 25 ఏళ్ల ఒప్పందం చేసుకుంటారని.. అలా పాతికేళ్లలో తెలంగాణ ప్రజలపై రూ.82వేల కోట్ల భారం పడుతుందని తెలిపారు.
అప్పు, మిత్తి లేకుండా కరెంటు ఇవ్వడానికి ఎన్టీపీసీ సిద్ధంగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. అప్పు పుట్టడం లేదంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. కమీషన్ల కోసమే కొత్త విద్యుత్ ప్లాంట్లు కడతామని కాంగ్రెస్ చెబుతుందని విమర్శించారు. ప్రజలపై భారం పడవద్దనే బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని తెలిపారు.
మాట్లాడేటప్పుడు కాంగ్రెస్ గత చరిత్ర చూసుకోవాలని భట్టి విక్రమార్కకు హరీశ్‌రావు హితవు పలికారు. ఏ బొగ్గు ఉన్నదని విజయవాడ, రాయలసీమ, కృష్ణపట్నంలో విద్యుత్ ప్లాంట్లు కట్టారని ప్రశ్నించారు. బ్యాలెన్స్ చేసుకోవడానికే వేర్వేరు చోట్ల థర్మల్ ప్లాంట్లు కడతారని తెలిపారు. థర్మల్ ప్లాంట్లలో ఫ్లై యాష్ ప్రధాన సమస్యగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి, నీరు అందుబాటులో ఉండటం వల్లనే దామరచర్లలో ప్లాంట్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఫ్లైయాష్ వాడుకుంటామని సిమెంట్ ఫ్యాక్టరీలు ఒప్పందం చేసుకున్నాయని అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు నాడు తాళం వేస్తానని మంత్రి కోమటిరెడ్డి ప్రగల్భాలు పలికారని అన్నారు. నాడు తాళం వేస్తానన్న కోమటిరెడ్డి.. నేడు కేబినెట్‌లో తాళం కొడుతున్నారని విమర్శించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రారంభానికి వెళ్లడానికి కోమటిరెడ్డికి సిగ్గుండాలన్నారు.

# పవన్‌కు దొరకని సపోర్ట్

**హైదరాబాద్ :** రాజకీయాలు అన్నాక విమర్శలు ఉంటాయి. ప్రతి విమర్శలు సైతం ఉంటాయి. అయితే ఆ విమర్శలు హుందాగా ఉండాలే కానీ? వ్యక్తిత్వ హననానికి దిగేలా ఉండకూడదు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పైఇప్పుడు తెలంగాణ నేతలు అలానే మాట్లాడుతున్నారు. బిఆర్ఎస్ కు చెందిన జగదీశ్వర్ రెడ్డి అయితే శృతిమించి విమర్శలు చేశారు. పవన్ కళ్యాణ్ కు బుర్ర లేదంటూ మాట్లాడారు. కోనసీమకు తెలంగాణ దిష్టి తగిలిందని పవన్ వ్యాఖ్యానించడం తప్పు అయ్యింది వారి దృష్టిలో. మొన్న మధ్యన పవన్ రాజోలు పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉప్పునీటితో కొబ్బరి పంట నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ పవన్ దృష్టికి రైతులకు తీసుకెళ్లారు. తెలుగు రాష్ట్రాల్లో కోనసీమ అందమైన ప్రాంతమని.. అటువంటిది తెలంగాణలో లేకపోవడం అక్కడి ప్రజలు బాధపడుతుంటారని.. వారి దిష్టి తగిలిందేమోనని పవన్ వ్యాఖ్యానించారు. కేవలం సానుకూల దృక్పథంతో చేసిన ఈ వ్యాఖ్య పై తెలంగాణ నేతలు విమర్శల పర్వానికి దిగుతున్నారు.అయితే ఇప్పుడు తెలంగాణనుంచి పవన్ కళ్యాణ్ పై ఒత్తిడి పెరుగుతోంది అక్కడి నేతల నుంచి. తెలంగాణ విషయంలో తప్పుడు వ్యాఖ్యలు చేసినందుకు పవన్ క్షమాపణలు చెప్పాలన్నది వారి డిమాండ్. అలా అయితే కెసిఆర్ వందలసార్లు క్షమాపణ చెప్పాలి ఏపీ ప్రజలకు. ఆయన ఏపీ నేతలను దూషించారు.. ఏపీ ప్రజలను చాలా చులకన చేసి మాట్లాడారు. కేటీఆర్ కూడా తక్కువ తినలేదు. చాలాసార్లు ఆయన ఏపీతోపాటు ఏపీ ప్రజలపై కూడా విమర్శలు చేశారు. చంద్రబాబు అరెస్ట్ సమయంలో హైదరాబాద్లో



ఆందోళనలు అవసరం లేదని కూడా తేల్చి చెప్పారు. మరి హరీష్ రావు గురించి చెప్పనవసరం లేదు. ఆంధ్ర నేతలతో పాటు ప్రజలను తిడితేనే సెంటిమెంట్ పండుతుందని భావించిన ఆ ముగ్గురు నేతలతో పాటు ఆ పార్టీ నేతలు ఏపీని ఎంతలా తూలనాడారో తెలియనిది కాదు. ఈ లెక్కన వారు ఎన్నిసార్లు క్షమాపణ చెప్పాలి?తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలో ఆ పరిస్థితి లేదు. ప్రత్యేక రాష్ట్ర సెంటిమెంట్ రగిలిస్తేనే తమకు మనుగడ అని అక్కడ రాజకీయ పార్టీల నేతలు గుర్తించారు. కానీ ఏపీ రాష్ట్రానికి చెందిన ఒక డిప్యూటీ సీఎం పైనే తెలంగాణ నేతలు విమర్శలు చేస్తుంటే.. ఏపీ నుంచి ఒక్కరంటే ఒక్క నే త కూడా ఖండించడం లేదు. పవన్ కళ్యాణ్ పై బిఆర్ఎస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా విమర్శలు చేస్తున్నారు. ఆ రెండు పార్టీలు అక్కడ రాజకీయ ప్రత్యర్థులు. అయినా సరే పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేసేందుకు పోటీ పడుతున్నాయి. కానీ ఏపీ నుంచి మాత్రం ఆ విమర్శలకు కౌంటర్ లేకుండా పోతోంది. ఇది అత్యంత బాధాకరం కూడా.

## వారికి ఐఏఎస్ హోదా ఎందుకు కల్పించారు?

-మొదటిపేజీ తరువాయి

నోటీసులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 26వ తేదీన విడుదల చేసిన జీవో 1342 ప్రకారం పలువురు ఐపీఎస్ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించిందని, అది చట్టవిరుద్ధమని వడ్ల శ్రీకాంత్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శ్రీకాంత్ తరఫున సీనియర్ న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద ధర్మాసనం ముగ్గురు అధికారులకు ఐఏఎస్ హోదాను ఎందుకు కల్పించారో డిసెంబర్ 10వ తేదీ లోపు వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జారీ చేసిన నోటీసుల్లో ఆదేశించారు.

## మేడారం అభివృద్ధిపై ఫోకస్

-మొదటిపేజీ తరువాయి

నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గద్దెల దగ్గర నాలుగు వైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. గద్దెలకు గ్రాండ్ లుక్ వచ్చేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. గుడి చుట్టూరా పచ్చదనం అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, అడూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కరీంనగర్‌లో లవర్‌తో నామినేషన్...

**కరీంనగర్ :** తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు.. ప్రియురాలితో సర్పంచ్ పదవికి నామినేషన్ వేయించాడు. దీంతో తమ కుమార్తె కనిపించడం లేదంటూ యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక తమకు రక్షణ కల్పించాలని సదరు యువతి, యువకుడు కూడా పోలీసులను ఆశ్రయించడం గమనార్హం. అంతకుముందు కరీంనగర్‌లో సర్పంచ్ అవ్వాలనే కోరికతో తొందరపడి పెళ్లి చేసుకున్న ఓ వ్యక్తి ప్లాన్ రివర్స్ అయిన సంగతి తెలిసిందే.గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. నామినేషన్ల పర్వం జోరుగా సాగుతోంది. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్ పదవి కోసం 25,654 నామినేషన్లు, వార్డు స్థానాలకు 82,276 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ వేళ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లా తాళ్లపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ అనే యువకుడు.. తన ప్రియురాలు శ్రీజతో సర్పంచ్ పదవికి నామినేషన్ వేయించాడు. ఈ గ్రామంలో ఎస్సీకి సర్పంచ్ స్థానం రిజర్వ్ అయింది. దీంతో పెళ్లి చేసుకోకుండానే ప్రేయసితో నామినేషన్ వేయించాడు. ఈ ఘటన సర్వత్రా చర్చనీయాంశమైంది.ప్రస్తుతం ఆ యువతి బీటెక్ ఫైనల్ ఇయర్ చదవుతున్నట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులకు చెప్పకుండా సదరు యువతి.. ప్రియుడితో కలిసి నామినేషన్ వేసింది. ఈ విషయం తెలుసుకున్న ఆ యువతి తల్లిదండ్రులు.. తమ కూమార్తె కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు తమకు రక్షణ కల్పించాలంటూ యువతి, యువకుడు కూడా పోలీసులను ఆశ్రయించారు. తన ఇష్టంతోనే చంద్రశేఖర్ వద్దకు వచ్చానని యువతి చెప్పింది. తనను ఎవరూ బలవతం చేయలేదని తెలిపింది. అనంతరం తనను గెలిపించాల్సిందా గ్రామంలో ప్రచారం చేసింది.ఇలాంటి ఘటనే కరీనంగర్ జిల్లాలో జరిగింది. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామానికి చెందిన ముచ్చె శంకర్ అనే వ్యక్తికి సర్పంచ్ కావాలనే చిరకాల కోరిక ఉంది. ఎన్నికల కోసం ఎప్పటినుంచో సన్నద్ధమవుతున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. పెళ్లి చేసుకుని తన భార్యను సర్పంచ్ కుర్చీలో కూర్చోబెట్టి చక్రం తిప్పుదామనుకున్నాడు. అయితే తాను అనుకున్న సమయం కంటే ముందే ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో హడావిడిగా నల్గొండకు చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. అనంతరం భార్యను ఓటర్ జాబితాలో చేర్చడానికి దరఖాస్తు చేసుకున్నాడు

## భారం కానున్న విలీనం

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల చాలా కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ అభివృద్ధిపై దృష్టి పెట్టిన రేవంత్ సర్కార్.. తాజాగా నవంబర్ 25న నిర్వహించిన కేబినెట్ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ సమీపంలోని మున్సిపాలిటీలు, గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. అయితే దీనిపై ప్రజలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెజారిటీ సానుకూలంగా ఉన్నా, ఆస్తి పన్ను పెరుగుదల, నిధి ఉపయోగం గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.
మణికొండ, నార్సింగి వంటి ప్రాంతాలు ఆస్తి పన్నుల ద్వారా బలమైన ఆదాయం సంపాదిస్తున్నాయి, అయితే జవహర్‌నగర్, జల్పల్లి, తుక్కుగూడలో ఆర్థిక సమస్యలు ఉన్నాయి. విలీనం తర్వాత మొత్తం నిధులను ఎలా పంపిణీ చేస్తారో అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్థానిక అవసరాలకు ముందుతీసుకునేలా హామీ ఇవ్వాలని కోరుకుంటున్నారు.నగరానికి సమీపంలో ఉన్న వందల గ్రామాలను చేర్చినా, వాటి గ్రామీణ లక్షణాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి. ప్రాంతాలవారీగా జనసాంద్రత భిన్నంగా ఉండడంతో మణికొండ, నార్సింగి వంటి దట్ట ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పెద్దఅంబర్‌పేట్, ఘట్కేసర్ ప్రాంతాల్లో తక్కువ జనాభాకు సరిపడా వనరులు కేటాయించాలని నిపుణులు సూచిస్తున్నారు.ఇక జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన రాజకీయ, సామాజిక ఘర్షణలకు దారితీయవచ్చు. ఇవి సమర్థవంతంగా పరిష్కరించకపోతే విలీన ప్రక్రియ సమస్యలకు దారితీస్తుంది. సమతుల్య పరిపాలన కోసం అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి.ప్రజలు ప్రయోజనాలను ఆశిస్తూ, స్థానిక అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చేలా పారదర్శకత కావాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళిక అమలు చేస్తే బృహత్తర అభివృద్ధి సాధ్యమవుతుంది.

**మరి వాటి సంగతేంటీ**

ఒకప్పుడు హైదరాబాద్ ఒక స్థాయి వరకు ఉండేది. ఎప్పుడైతే ఔటర్ రింగ్ రోడ్డు అనేది అందుబాటులోకి వచ్చిందో.. అప్పుడే హైదరాబాదు రూపు రేఖలు మారిపోయాయి. కొత్త హైదరాబాద్ పుట్టుకొచ్చింది. శివారు ప్రాంతాలు విపరీతంగా అభివృద్ధి చెందడంతో హైదరాబాద్ నగరం మహానగరంగా విస్తరించింది. అప్పట్లో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పలు ప్రాంతాలను మునిసిపాలిటీలుగా రూపొందించారు. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను మరింతగా విస్తరించే కార్యక్రమానికి రూపకల్పన చేసిందిహైదరాబాద్ నగర పరిధిలో ఉన్న పురపాలకాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంస్థలో కలిపేసింది.. ప్రభుత్వ నిర్ణయంతో ఇన్ని రోజులపాటు పురపాలకాల పరిధిలో ఉన్న ప్రజలలో ఇప్పుడు సరికొత్త చర్చ మొదలైంది. వారికి లభించే ప్రయోజనాలు, ఎదురయ్యే నష్టాల గురించి చర్చించుకుంటున్నారు.హైదరాబాద్ పరిధిలో పురపాలకాలను విలీనం చేసిన క్రమంలో ఆస్తి పన్ను పెరుగుతుందా? చెల్లించే పనులు ఇతర ప్రాంతాలలో ఖర్చు చేస్తారా? అభివృద్ధి అనేది స్థిరంగా సాగుతుందా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ఉదాహరణకు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న మణికొండ, నార్సింగి నగరపాలక సంస్థలకు ఆస్తి పన్ను విపరీతంగా వస్తుంది. తుక్కుగూడ, జల్ పల్లి, జవహర్ నగర్ ప్రాంతాలు సరైన ఆదాయం లేకుండా ఇబ్బంది పడుతున్నాయి. వీటన్నిటిని హైదరాబాదులో కలిపితే నిధులు ఎలా ఖర్చు చేస్తారు? అనే ప్రశ్న ప్రజల్లో వ్యక్తం అవుతుంది.హైదరాబాద్ నగరానికి దగ్గరగా ఉన్న గ్రామాలు ఇకపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం అవుతాయి.. వాటిని నగర అభివృద్ధిలో భాగస్వామ్యం ఎలా చేస్తారు? ఒకవేళ చేస్తే ఏం పద్ధతి పాటిస్తారు? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. గ్రామీణ వాతావరణం పట్టణ వాతావరణంతో పోల్చి చూస్తే భిన్నంగా ఉంటుంది. అలాంటప్పుడు విలీన గ్రామాలలో అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళిక ఉండాలి.హైదరాబాద్ నగరం అతి పెద్దది అయినప్పటికీ.. ప్రాంతాల ఆధారంగా జనసాంద్రత ఉంటుంది. ఉదాహరణకు పెద్ద అంబర్పేట్, తుక్కుగూడ, ఘట్కేసర్ ప్రాంతంలో జనసాంద్రత తక్కువగా ఉంటుంది. నార్సింగి, మణికొండ ప్రాంతాలలో జనసాంద్రత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి అప్పుడు ఈ ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేస్తున్నప్పుడు అధికారులు జనాభాను, ఇతర విషయాలను లెక్కలోకి తీసుకోవాల్సి ఉంటుంది.పునర్విభజన గతంలోనే అనేక అలజడులను సృష్టించింది. త్వరలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో కచ్చితంగా డివిజన్ల పునర్విభజన చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు అధికారులు ఎలాంటి విధానాన్ని పాటిస్తారు.. వివాదాలు లేకుండా ఎలా పరిష్కరిస్తారు.. అనేక ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది. మహా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆలోచన గొప్పగానే ఉన్నప్పటికీ.. దాని ఆచరణ సాధ్యమైతేనే ఆ నిర్ణయానికి సార్థకత లభిస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు.

# బాణాపురంలో అండర్పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సిపిఎం రాస్తారోకో





**సామాన్యుడి అస్త్రం జనగామ** బాణాపురంలో అండర్పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయకపోతే పెద్ద ఎత్తున సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతాం సిపిఎం జనగాం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ జనగామ పట్టణంలో హైదరాబాద్ రోడ్డు నుండి సిద్దిపేట కలుపుతూ ఎన్ హెచ్ హైవే బైపాస్ రోడ్డు పనులు జరుగుతున్నాయి ఈ సందర్భంగా బాణాపురంలో అండర్పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మాట్లాడుతూ గతంలో 132 రోజులు రిలే దీక్షలు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు ఎంపీ ని కలిసాము ఎమ్మెల్యే ని కలిసాము కలెక్టర్ ని కలిసాము ఈ సందర్భంగా ఎన్ హెచ్ హైవే అధికారులు ఆర్డీవో గారు దీక్ష దగ్గరికి వచ్చి తప్పకుండా అండర్పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేపిస్తాం అని చెప్పారు మళ్లీ రాత్రి ఇరువైపులా రోడ్డు మీద మట్టి పోస్తున్నారు అని పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించాము రాస్తారు ఒక దగ్గరికి సబ్ ఇన్స్పెక్టర్ సీఐ సత్యనారాయణ రెడ్డి రాస్తారోకో కూర్చున్న దగ్గరికి వచ్చి ఫై ఎన్ హెచ్ అధికారులతో మాట్లాడి రోడ్డును బ్లాక్ చేయకుండా చూస్తామని అధికారులతో మాట్లాడారు ఎన్ హెచ్ అధికారులు ఇచ్చిన మాటను నిలుపుకోవాలని ఇదే సందర్భంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మరియు ఎమ్మెల్యే పళ్ళ రాజేశ్వర్ రెడ్డి కలెక్టర్ స్పందించి అండర్పాస్ బ్రిడ్జిని త్వరగా వేయించాలని వారు అన్నారు లేకపోతే ఇక్కడికి వెళ్లి గ్రామాలు ఏసి రెడ్డి నగర్ మూడో విడత ఇందిరమైన్లు ఎల్లముల శ్రీనివాసపురం సిద్దంకి పెదరాంచర్ల పోచన్నపేట గ్రామాలను కలుపుకొని ఆందోళన చేపడుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు ఎండి అజారుద్దీన్ పట్టణ కమిటీ సభ్యులు బూడిది ప్రశాంత్ నాయకులు ధరవత్ మహేందర్ పల్లెర్ల శంకర్ రాగాల్ల అంజయ్య ఆడ రమేష్ పాము బిక్షపతి మంద నరసింహులు పసులాది హరీష్ శ్రీకాంత్ చింతల బాబు వసంత రేణుక పద్మ కంతి ఆంజనేయులు మురళి ఎండి మునీర్ యాకమ్మ మౌనిక లక్ష్మి రేణుక తదితరులు పాల్గొన్నారు

# డ్రై ఫ్రూట్స్ శక్తిని పెంచుతాయి





శాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"

డ్రై ఫ్రూట్ హౌజ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** డ్రై ఫ్రూట్స్ శక్తిని పెంచుతాయి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయనీ షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్ నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో గల డ్రై ఫ్రూట్ హౌజ్ నూతన షాపును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రైఫ్రూట్ హౌస్ నిర్వాహకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షాపు ప్రారంభోత్సవం పురస్కరించుకొని ఆయన మీడియాతో మాట్లాడారు. డ్రై ఫ్రూట్ మన ఆరోగ్యం అంత జీవితానికి దోహద పడతాయని అన్నారు. అవసరమైన విటమిన్లు, ఖనిజాలు మరియు యాంటీఆక్సిడెంట్లు అందిస్తాయనీ ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి మరియు కడుపులో మంటను ఎదుర్కోవడంలో సహాయపడతాయన్నారు. అనేక రకాల డ్రైఫ్రూట్స్ మనిషి ఆరోగ్యం మతమైన జీవితంలో పాలుపంచుకుంటాయని ఇలాంటివి తినడం ద్వారా మరింత ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. షాద్ నగర్ లో ఇక్కడి ప్రాంత ప్రజల కోసం ఇంత పెద్ద షాపును ఏర్పాటు చేసి రకరకాల డ్రైఫ్రూట్ నాణ్యమైన ధరకు నాణ్యతగా విక్రయించడం సంతోషించేదగ్గ విషయమని యజమానులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ బాబర్ జర్నలిస్ట్ కేపీ, గిరిజన ఆదివాసీ కోఆర్డినేటర్ రఘునాయక్ సీనియర్ నాయకులు అగ్గనూర్ బస్వం మహమ్మద్ ఇబ్రహీం, రాజు నాయక్, ముబారక్ అలీ ఖాన్, ఖదీర్, మాధవ యాదవ్, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు..

# గీతా సారాంశమే జీవిత సారాంశం..

మనిషిలో మార్పు, చైతన్యం తెచ్చేదే భగవద్గీత..

ఖురాన్, బైబిల్ కూడా అలాంటి పవిత్ర గ్రంథాలే..

మనిషి చేత యుద్ధం చేయించగలిగే శక్తి గీతది..

గీతా ప్రబోధాన్ని ప్రతి ఒక్కరు ఆచరించాలి..

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..

గీత ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సందేశం




**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** భగవద్గీతలో చెప్పే ప్రతి మాట మనిషి జీవితంతో ముడిపడి ఉంటుంది.. గీతా సారాంశాన్ని అర్థం చేసుకొని పాటించగలిగితే మనిషి దైవమంత గొప్పగా జీవితంలో ఎదగగలుగుతాడు.. అని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు.షాద్ నగర్ పట్టణంలోని శ్రీ శివ మారుతి అయ్యప్ప గీతా మందిరంలో జర్నలిస్ట్ కేపీ ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్ప స్వాముల అన్న భిక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీత ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ అధ్యక్షులు లష్కర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రెటికల్ నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేను సన్మానించి భగవద్గీతను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధంలో తన బంధువులను చూసి అస్త్ర సన్యాసం చేసి నిర్వీర్యం అయిపోయిన అర్జునుడిని యుద్ధానికి పురిగొల్పిన శక్తి భగవద్గీతకు ఉందన్నారు. మానవ జీవితంలోనూ భగవద్గీత ఎంతో ప్రభావం చూపిస్తుందని, అందులోని సారాంశాన్ని అర్థం చేసుకొని ముందుకు నడిస్తే భవిష్యత్తు బంగారు మాయమవుతుందని అన్నారు. బైబిల్, ఖురాన్, భగవద్గీత వేరువేరు మతాల గ్రంధాలు అయినప్పటికీ వాటిలో ఉండే సారాంశం ఒకటేనని ఆయన అన్నారు. కులాలు, మతాలు మనిషిని క్రమమైన మార్గంలో నడిపించడానికి తప్ప వాటి పేరు చెప్పి విడిపోవడానికి విభేదించడానికి కాదని అన్నారు. భగవద్గీతలో చెప్పిన అంశాలను ఆచరిస్తూ ప్రతి ఒక్కరు ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన ఆకాంక్షించారు. మనిషిలో నీతిని, నిజాయితీని, క్రమశిక్షణను పెంపొందించేది, ధన సంపదపై ఆసక్తిని తగ్గించేది భగవద్గీత మాత్రమేనని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భగవద్గీతలోని ముఖ్యమైన శ్లోకాలను మాజీ ఎమ్మెల్యే బక్కలి నరసింహులు కంఠస్థం చేశారు. శ్లోకాలకు సంబంధించిన సారాంశాన్ని చక్కగా వివరించారు. భగవద్గీత జయంతి రోజున అనుకోకుండా ఈ కార్యక్రమం జరగడం భగవత్ సంకల్పమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విషయం, జర్నలిస్ట్ కెపి, లస్కర్ ఆంజనేయులు రెడ్డికల్ నందీశ్వర్ మల్చలం మురళి, రాజా వరప్రసాద్, స్థానిక జర్నలిస్టులు లక్కాకుల రమేష్, సీనియర్ జర్నలిస్ట్ రంగనాథ్, బాల రాజేష్, మహేష్ భైరమోని, రాకేష్, మల్లేష్, దిర్శిణం శంకర్, రవి, కృష్ణ, సాయి నాథ్ రెడ్డి, వానరసి జగన్, బాలు, ఎరుపుల నర్సింహా, ఇంజమూరి వెంకటేష్, షకీల్, రీయాజ్, బూర్గుల రమేష్, ప్రవీణ్, మల్చలం రమేష్ తదితరులు పాల్గొన్నారు..

## ఆయుష్మాన్ ఆస్పత్రిలో గైనకాలజీ సేవలు



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ జిల్లా కేంద్రంలోని ఆయుష్మాన్ హాస్పిటల్లో గైనకాలజీ సేవలు ప్రారంభించినట్లు ఆస్పత్రి నిర్వహకులు డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ వార్షికోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో మరిన్ని ఆధునిక సాంకేతిక సదుపాయాలు కల్పించామన్నారు. పేషంట్ల సౌకర్యార్థం లేడీ గైనకాలజిస్ట్ మహిళలకు పూర్తి వైద్య సహకారం, సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ జైన రమేశ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అవగాహనతో ఎయిడ్స్ ఆమడదూరం

## టీఎస్జేయూ జిల్లా అధ్యక్షుడు నరేందర్



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ : నివారణ తప్ప చికిత్స లేని ఎయిడ్స్ వ్యాధిని అవగాహనతో అరికట్టి ఆమడ దూరం తరిమికొట్టవచ్చునని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ జనగామ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఉప్పలంచి నరేందర్ అన్నారు. సోమవారం జనగామ తెలంగాణ మైనారిటీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ఎయిడ్స్ డే సందర్భంగా ప్రిన్సిపాల్ కుమారస్వామి అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోగ నిరోధక శక్తిపై దాడి చేసే హెచ్ఐవీ విచ్చలవిడి శృంగారం వల్ల సంక్రమిస్తుందన్నారు. వ్యాధిపై అవగాహన పెంచుకుని, నిగ్రహశక్తి కలిగి ఉండాలని కోరారు. యూనియన్ ఉపాధ్యక్షుడు జి.కృష్ణ హెచ్.ఐ.వి ఎయిడ్స్ పై మాట పాటతో అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎయిడ్స్‌పై నిర్వహించిన వ్యాస రచన పోటీలోని విజేతలైన పి.మణికంఠ గౌడ్ (ప్రథమ), ఇరుగు అక్షిత్ (ద్వితీయ ), బి.వికాస్ (తృతీయ)కు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ పి.అనిల్ బాబు, యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.శివకుమార్, ప్రధాన కార్యదర్శి గన్ను కార్తీక్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా తుంగ కౌశిక్, కోశాధికారి కొన్నె ఉపేందర్, సభ్యులు అఫ్రోజ్, ఓంకార్, అయిలా నర్సింహచారి, ఉపాధ్యాయులు పెట్లోజు సోమేశ్వరాచారి, ఉపాధ్యాయులు సైదులు, సందీప్, సల్మాన్, శంకరాచారి,మహేందర్ పాల్గొన్నారు

## ఆయుష్మాన్ హాస్పిటల్ నందు అరుదైన కపాల(తల ఎముకల) శస్త్రచికిత్స




**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామలో అరుదైన కపాల తల ఎముకల శస్త్ర చికిత్సను ఆయుష్మాన్ హాస్పిటల్ వైద్య బృందం విజయవంతంగా పూర్తిచేసింది. తిరుమలగిరి ప్రాంతానికి చెందిన 25 సంవత్సరాల ప్రవీణ్ అనే యువకుడు గొడవలో తీవ్ర గాయాలతో ఆస్పత్రికి చేరగా, అతనికి కన్నుల చుట్టూ నలుపు, ముక్కు నుండి రక్త స్రావం వంటి లక్షణాలు కనిపించాయి. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో మెదడు సమీపంలోని తల ఎముకలు మూడు చోట్ల విరిగినట్లు గుర్తించారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే సాధ్యమయ్యే ఈ క్లిష్టమైన శస్త్ర చికిత్సను, జనగామలోనే ఆయుష్మాన్ హాస్పిటల్ వైద్యులైన డాక్టర్ పోకల సతీష్, డాక్టర్ అభిలాష్, డాక్టర్ మాచర్ల బిక్షపతి, డాక్టర్ కిరణ్, డాక్టర్ జూయిలీ మరియు వారి బృందం ఈరోజు ఉదయం సమర్థవంతంగా నిర్వహించారు. రోగి తల మొత్తం ఓపెన్ చేసి విరిగిన ఎముకలను సరైన స్థానంలో అమర్చి మూడు చోట్ల స్క్రూలుతో బిగించి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రవీణ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. జనగామ వంటి పట్టణంలో సాధారణ రుసుముతో ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్సను చేయగలగడం ఆస్పత్రి సామర్థ్యానికి నిదర్శనమని హాస్పిటల్ యాజమాన్యం పేర్కొంది. ఆస్పత్రి మొదటి వార్షికోత్సవ సందర్భంగా ఈ విజయవంతమైన ఆపరేషన్ తమ బృందం ప్రతిభకు నిదర్శనమని మేనేజింగ్ డైరెక్టర్ జైన రమేష్ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్లిష్ట శస్త్ర చికిత్సలను మరింత ప్రగతిశీలంగా అందిస్తామని హామీ ఇచ్చారు.ఆరోగ్య సమస్యల కోసం ప్రజలు జనగామ ఆయుష్మాన్ హాస్పిటల్ ను సంప్రదించాలని యాజమాన్యం కోరుతోంది. జైన రమేష్ మేనేజింగ్ డైరెక్టర్ ఆయుష్మాన్ హాస్పిటల్ జనగామ

## యువత ఉపాధి మార్గాలు అన్వేషించాలి..

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

9కే వైన్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే..




**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** యువత మార్గాలను అన్వేషించి ఉపాధి దిశగా నిలదొక్కుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలో 9కే వైన్స్ ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా యువకులు వ్యాపారాల వైపు ముందడుగు వేయడం సంతోషకరమని అన్నారు. చేసే వృత్తిని నిబద్ధతతో చేసి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా వైన్స్ యజమానులు రాణా, జట్టా మహేందర్ తదితరులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శంకర్ పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ బాబర్ జర్నలిస్ట్ కేపీ, గిరిజన ఆదివాసీ కోఆర్డినేటర్ రఘునాయక్ సీనియర్ నాయకులు అగ్గనూర్ బస్వం మహమ్మద్ ఇబ్రహీం, రాజు నాయక్, ముబారక్ అలీ ఖాన్, ఖదీర్, మాధవ యాదవ్, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు..

# “మతమంతా” గతం.. సామరస్యమే అభిమతం..

షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే “బక్కని నర్సింలు”

జర్నలిస్ట్ కేపీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నవితరణ

అయ్యప్ప స్వామికి వైభవంగా పూజలు, నైవేద్యం

ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, ప్రముఖ న్యాయవాది కంచి రాజగోపాల్

కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు, మిత్రులు..





**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** మతమంతా గతం కావాలి.. సామరస్యమే ప్రతి ఒక్కరి అభిమానం కావాలి.. మతాలు వేరైనా దైవం ఒక్కటే.. భాష ఏదైనా సారాంశం ఒక్కటే.. అని మాజీ ఎమ్మెల్యే, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని అయ్యప్ప గీతా మందిరంలో జర్నలిస్ట్ ఎండి ఖాజాపాషా (కేపీ) ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్న వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, ప్రముఖ న్యాయవాది కంచి రాజగోపాల్, యువ నాయకుడు మురళీమోహన్ (అప్పి), స్థానిక జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే బక్కని మాట్లాడుతూ మనిషికి ఏ దానం కూడా సంతృప్తిని ఇవ్వదని, అన్నదానం ఒక్కటే సంతృప్తిని ఇస్తుందని పేర్కొన్నారు. మతాలకు అతీతంగా జర్నలిస్ట్ కెపి చేస్తున్న ఈ సేవ అమూల్యమైనదని ఆయన పేర్కొన్నారు. మతాలు, కులాలు మనిషి తనను తాను క్రమశిక్షణలో పెట్టుకోవడానికి పుట్టాయి తప్ప మనుషులను విడదీసేం దుకు కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అయ్యప్ప స్వాముల సేవలో పాల్గొనే అవకాశం వచ్చినం దుకు సంతృప్తిగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రెటికల్ నందీశ్వర్ కోశాధికారి దాస కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యే తో ప్రత్యేక పూజలు చేయించి అనంతరం శాలువాతో సత్కరించారు. భగవద్గీతను కానుకగా అందించారు. అదేవిధంగా మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, ప్రభుత్వ న్యాయవాది కంచి రాజగోపాల్, సీనియర్ జర్నలిస్టులు లక్కాకుల రమేష్ కుమార్, శ్రీశైలం, నరసింహ రెడ్డి, రాకేష్, సాయినాథ్ రెడ్డి, కృష్ణ, మహేష్, శంకర్, ఎస్బి బాలు, రవితేజ, షకీల్, రియాజ్, బూర్గుల రమేష్, ప్రవీణ్ యాదవ్, తదితరులు హాజరయ్యారు.

**వైభవంగా పూజలు..**

జర్నలిస్ట్ కేపీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నైవేద్యం అందించారు. స్వాములు రెటికల్ నందీశ్వర్ స్వామి , ప్రతాప్ రెడ్డి చింటూ స్వామి, రాజా వరప్రసాద్ స్వామి, మల్చాలం మురళీల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు నైవేద్యం సమర్పించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు కేపీ మాట్లాడుతూ గతంలో నందిగామ అయ్యప్ప స్వామి ఆలయంలో అన్న వితరణ కార్యక్రమంలో పాలుపంచుకున్నానని, ప్రస్తుతం నందీ శ్వర స్వామి సూచన మేరకు ఈ ఆలయంలో ఈ కార్యక్ర మాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. దైవ సేవలో నిమగ్న మై ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉం టుందని అన్నారు. మతాలు వేరైనా దేవుడు ఒకటేనని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. బిజెపి నేత మల్చలం మురళి స్వామి మాట్లాడుతూ మతాలకు అతీతంగా ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినం దనీయమని అన్నారు. బీఆర్ఎస్ నేత రాజా వరప్రసాద్ స్వామి మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో మొదటి నుంచి పాలుపంచుకుంటూ సమైక్యతను చాటుతున్న జర్నలిస్ట్ కేపీని అభినందించారు. కెపితో పాటు ఆయన కుటుంబ సభ్యులు శ్యామల, సమీర్, హరీష ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా జర్నలిస్టులు లక్కాకుల రమేష్, రంగనాథ్ , సాక్షి శ్రీశైలం, నరసింహారెడ్డి, బాల రాజేష్, నిఘా కృష్ణ, ప్రవీణ్ యాదవ్, బైరమోని మహేష్, శ్రీశైలం, రాకేష్, సాయినాథ్ రెడ్డి, ఎస్ బి బాలు, షకీల్, రియాజ్, వారణాసి జగన్, ఇంజమూరి వెంకటేష్, బూర్గుల రమేష్ , మల్చలం రమేష్, ఎరుపుల నరసింహ రవితేజ, మిత్ర బృందం మురళీమోహన్ ( అప్పి ) తదితరులు పాల్గొన్నారు...

# ఏమిటి ఘోరం.. ఎవరిదీ నేరం..

కౌలు రైతుపై కక్షగట్టిన గుర్తు తెలియని దుండగులు..

నిలువ చేసిన పత్తికి నిప్పంటించి శిక్ష..

గుర్తు తెలియని దుండగుల ఘనకార్యం..నష్టకష్టాల్లో పడ్డ కౌలు రైతుల ఆహాకార్యం..

పెద్దల్కిచర్ల పత్తి దగ్ధం ఘటనలో ఏమిటి గోరం ఎవరిది నేరం..

కౌలు రైతులపై కక్ష కట్టిన గుర్తు తెలియని దుండగులు..





**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** 12 ఎకరాలు సాగు చేసి నిలువ చేసుకున్న 60 క్వింటల్లా పత్తికి నిప్పంటించి వారిని నష్ట కష్టాల్లోకి నెట్టిన ఘటన. రంగారెడ్డి జిల్లా చౌదర్ గూడా మండల పరిధిలో పెద్దేల్కిచర్ల గ్రామంలో నేడు వేకువ జామున వెలుగు చూసింది.. వివరాల్లోకి వెళితే పెద్దేల్కిచర్ల గ్రామానికి చెందిన ఇద్దరు కౌలు రైతులు కందూరి గోవర్ధన్ రెడ్డి, ఘనపురం జనార్ధన్ రెడ్డిలకు సంబంధించిన 60 క్వింటాళ్ల పత్తిని ఇంట్లో నిలువ చేశారు. అయితే అర్ధరాత్రి తర్వాత ఎవరో గుర్తు తెలియని దుండగులు 60 క్వింటాళ్ల పత్తిని నిప్పంటించి దగ్ధం చేశారు. ఉట్కూరి బుగ్గేశ్వర్ వద్ద 12 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి వ్యవసాయం చేసిన ఇరువురు రైతులు గోవర్ధన్ రెడ్డి జనార్దన్ రెడ్డిలు వచ్చిన పంటను మార్కెట్లో విక్రయించేందుకు ఓ ఇంట్లో నిలువ చేశారు. ఇంతలోనే దుండగులు కక్షపూరితంగా వీరికి సంబంధించిన పత్తిని నిప్పటించడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్యాయంగా కౌలు రైతులకు నష్టం చేసిన వారిని వెంటనే పట్టుకుని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నాను. ఎండనక వాననక కష్టపడి చెమటోడ్చి పని చేస్తే చివరికి ఫలితం లేకుండా తమ పంటకు నిప్పు పెట్టిన దుండగులను అత్యంత కఠినంగా శిక్షించాలని రైతులు వేడుకుంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు ప్రాధేయ పడుతున్నారు. సంఘటన స్థలాన్ని స్థానిక పోలీసులు సందర్శించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నారు...

# గూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఘనంగా ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** పేదల కష్టాలను తాకే సేమగూడ పంచాయతీలో ఎన్టీఆర్ పెన్షన్ల అందజేతకు ప్రజల స్పందన గూడ సర్పంచ్ కంబిడి సరోజ కుమారి- అరకు మార్కెట్ యాడ్ వైస్ ఛైర్మన్ జ్ఞాన ప్రకాష్ ప్రజలకు అండగా ఎన్టీఆర్ పెన్షన్‌గొచ్చెరి, కోడెలి, ఈత గొప్పు గ్రామాల్లో సేవా విస్తరణ అల్లూరి సీతారామరాజు జిల్లా, హుకుంపేట మండలం, గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని గొచ్చెరి, కోడెలి, ఈత గొప్పు గ్రామాలలో ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఈ రోజు గ్రామాల్లో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. సామాజిక సేవా స్ఫూర్తితో నడిచిన ఈ కార్యక్రమంలో గూడ గ్రామ సర్పంచ్ కంబిడి సరోజ కుమారి, అరకు మార్కెట్ యార్డ్ వైస్ చైర్‌పర్సన్ కంబిడి జ్ఞానప్రకాశ్ పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందించారు. గ్రామస్తుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ లబ్ధిదారుడికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేరేలా చర్యలు కొనసాగుతాయని సర్పంచ్ సరోజ కుమారి తెలిపారు. గ్రామ ప్రజల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామంటూ వైస్ చైర్‌పర్సన్ జ్ఞానప్రకాశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కోడా బలవర్ధి రాజ్, వైస్ సర్పంచ్ రాంబాబు, వార్డ్ మెంబర్ రాంబాబు, టిడిపి సీనియర్ నాయకులు తౌడన్న, గ్రామ ఐక్య అధ్యక్షులు సిరిగం రమణ, పాంగి నల్లబాబు, గ్రామ పెద్దలు పూజారి లక్ష్మయ్య, గ్రామ ఐక్య ఉపాధ్యక్షులు శ్రీనివాస్, గ్రామ ఐక్య సభ్యుడు వంతల రవీంద్ర, సిరిగం లవ రాజు, పాంగి రామ్మూర్తి (పిసా సెక్రటరీ), గ్రామ ఐక్య సెక్రటరీ సిరిగం బాబురావు, సిరిగం పంతులు, పాంగి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు క్రమబద్ధంగా, పారదర్శకంగా పెన్షన్ల పంపిణీ జరగడం గ్రామ ప్రజల్లో సంతృప్తి కలిగించింది. సేవా భావంతో ప్రజలకు చేరువవుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ఐక్య వ్యవస్థ సభ్యుల ప్రయత్నాన్ని గ్రామస్తులు అభినందించారు.



# న్యాయహక్కుల కోసం వీఆర్ఏల సమరం

పెదబయలు మండలంలో వినతిపత్రాల వెల్లువ

వీఆర్ఏల సునామీ 5వ తేదీకి సిద్ధంతహసీల్దార్‌కు నోటీసు సమర్పణ పెదబయలు వీఆర్ఏ యూనియన్ ప్రెసిడెంట్ గంజాయి,నీలకంఠం.

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** అల్లూరి సీతారామరాజు పెదబయలు, మండల కేంద్రంలో గల గ్రామీణ పరిపాలనలో కీలక భాగస్వాములైన గ్రామ ఆదాయం సహాయకులు (వీఆర్ఏలు) తమ సమస్యలకు పరిష్కారం కావాలని మండలంలో ఆందోళన జ్వాలలు రగిల్చారు. ఈ నేపథ్యంలో పెదబయలు మండలం తహసీల్దార్ గారికి భారీగా చేరుకున్న వీఆర్ఏలు వినతిపత్రం సమర్పిస్తూ, ఈ నెల 5వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించనున్నట్లు అధికారిక సమాచారం అందించారు. మండల వీఆర్ఏల సంఘ అధ్యక్షులు గంజాయి నీలకంఠం, ఉపాధ్యక్షులు సుందర్ దేవ్, కోటి ఈశ్వర్ రావు, నాయకులు రమేష్, నాగన్న, సన్యాసమ్మ తదితరులు నాయకత్వం వహించిన ఈ కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయంలో ఉద్వేగభరిత వాతావరణాన్ని సృష్టించింది. వినతిపత్రం ద్వారా వీఆర్ఏలు స్పష్టం చేసిన అంశాలు జీతభత్యాల్లో అన్యాయం పని భారం పెరిగినా గుర్తింపు లేకపోవడం భద్రతా చర్యలు, శాశ్వత ఉద్యోగీకరణలో స్పష్టత లేకపోవడం పలు పరిపాలనా సమస్యలకు నిత్యం గురవుతుండటం “ప్రతిదినం గ్రామాల్లో ప్రజల సేవలో అహర్నిశలు పనిచేస్తున్న వీఆర్ఏలకు ప్రభుత్వం కనీస న్యాయం చేయాలి. సమస్యలకు సమాధానం రాకపోతే జిల్లా స్థాయి ధర్నానే మా ఆఖరి మార్గం” అని నేతలు స్పష్టం చేశారు. మండల వ్యాప్తంగా వీఆర్ఏలు ఈ ఉద్యమానికి సంఘీభావం తెలపడంతో 5వ తేదీ ధర్నా జిల్లా స్థాయిలో భారీగా జరిగే అవకాశాలు ఉన్నాయి.



# వైద్యం కోసం వచ్చిన ప్రజలకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆకలి తీర్చినా బక్క రామస్వామి సుశీల బక్క సునీల్ అనిత శాన్వి వర్షిక్



**సామాన్యుడి అస్త్రం జనగామ** శ్రీ శ్రీమతి బక్క రామస్వామి సుశీల బక్క సునీల్ అనిత శాన్వి వర్షిక్, మానవత దృక్పథంతో మహా అన్న సమర్పణ కార్యక్రమం జనగామ జిల్లా ఆస్పత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించి ఘనంగా మానవత్వాన్ని చాటుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ ఈరోజు అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించిన బక్క సునీల్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ పుట్టినరోజు పెళ్లి రోజు సందర్భంగా ఏదైనా కానీ నిరాశ్రయులకు అనాధలకు నిరుపేదలకు ఒక పూట ఆకలిని తీర్చి జరుపుకోవాలని భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ప్రజలకు యువతకు పిలుపునిచ్చారు ఈ సేవ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి, బింగి నరసింహులు, ఎండి అప్రాచ్, గోల్కొండ శీను,ఉల్లెంగుల మణి, తదితరులు పాల్గొన్నారు

# విషాదాంతంగా ముగిసిన ప్రేమ కథ..

ఇద్దరు ప్రేమికుల ఆత్మహత్య

కొత్తూరు మండల కేంద్రంలో సంచలనం

సంఘటన స్థలాన్ని పరిశీలించిన శంషాబాద్ ఎసిపి శ్రీకాంత్ గౌడ్

కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం - కొత్తూరు సిఐ నరసయ్య






**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజక వర్గం కొత్తూరు మండల కేంద్రంలో ఇద్దరు ప్రేమి కులు బలవ న్మరణా నికి పాల్పడ్డారు. వీరి ప్రేమ కథ ఆత్మహత్య రూపంలో విషాదాం తంగా ముగియ డంతో కొత్తూరులో విషాద ఛాయలు అలము కున్నాయి. పొట్ట చేత పట్టుకుని బీహార్ నుండి బ్రతుకుతెరువు కోసం కొత్తూరు వచ్చిన వలస కార్మికుడి కుటుంబంలో చెలరేగిన ఈ కల్లోలానికి ముక్కుపచలానని పసి హృదయాలు పాడే ఎక్కబోతున్నాయి. కొత్తూరు మండల కేంద్రంలో నివాసం ఉంటున్న ట్రక్ డ్రైవర్ నవనీత్ దత్తకు ఇద్దరు కుమార్తెలు ఇందులో అనామిక (21) అనే యువతీ ధనుంజయ్ (25) అని యువకుడితో ప్రేమలో ఉంది. అయితే వీరందరూ ఒకే కంపెనీలో పనిచేస్తున్నారు. గత మూడు రోజులుగా అనామిక కంపెనీకి వెళ్లడం లేదు. సుమారు అనామిక కోసం ధనుంజయ్ ఇంటికి వచ్చాడు. అప్పటికే అనామిక ఫ్యాన్ కు ఉరివేసుకొని కనిపించింది. ఈ దుష్యం చూసి తట్టుకోలేని ప్రేమికుడు అతను కూడా ఆత్మహత్యకు పాల్పడినట్లు కొత్తూరు సిఐ నరసయ్య తెలిపారు. ట్రక్ డ్రైవర్ తండ్రి నవనీత్ దత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిపారు. అయితే ఇంట్లో కనిపిస్తున్న సిసి కెమెరాకు సంబంధించిన ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటికీ అది సరిగ్గా పని చేయడం లేదని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపబోతున్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని శంషాబాద్ ఎసిపి శ్రీకాంత్ గౌడ్ పరిశీలించారు..

# పింఛన్లు పంపిణీ



**దేవీపట్నం మండలం సామాన్యుడు అస్త్రం** మండలం లో ఇందుకూరు పంచాయతీ యం.రావిలంక గ్రామంలో ఎన్టీఆర్ పింఛన్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి శివరామకృష్ణ మండల ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# భీంపల్లి గ్రామంలో తోట శంకరయ్య సర్పంచ్, నామినేషన్ దాఖలు



**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** హనుమకొండ జిల్లా,కమలాపూర్ మండల, భీంపల్లి గ్రామానికి చెందిన తోట శంకరయ్య సర్పంచ్ పదవికి, నామినేషన్ దాఖలు చేశారు. గ్రామస్థుల మధ్య భారీ మద్దతుతో వచ్చిన ఆయన, “ప్రజల ఆశీర్వాదం ఉంటే గ్రామ అభివృద్ధి కోసం మరింత శ్రమిస్తాను” అని తెలిపారు. 2016లో ఎంపీటీసీగా ఘన విజయం సాధించిన తోట రాజమణి శంకరయ్య, భూలక్ష్మి మా లక్ష్మి ప్రతిష్టాపనలో కీలక పాత్ర పోషించిన, ,2020లో సర్పంచ్ గా పోటీ చేసినప్పటికీ అతి తక్కువ తేడాతో ఓటమి పాలయ్యారు. గ్రామాభివృద్ధి పైనే దృష్టి పెట్టిన ఆయన, భీంపల్లి గ్రామ,రామాలయ దేవాలయానికి చైర్మన్‌గా సేవలు అందించారు. వృద్ధులు, ముసలి వారితో ఆయన చూపించే ఆప్యాయత, అనురాగం, సేవాభావం గ్రామంలో మంచి పేరు తెచ్చిపెట్టాయి. గ్రామంలోని ప్రతి ఒక్కరితో దగ్గరగా మెలగడం, సమస్యలు విన్న వెంటనే పరిష్కారానికి కృషి చేయడం ఆయన ప్రత్యేకత. గ్రామస్తుల మద్దతు లభిస్తే సర్పంచ్‌గా గెలిచి భీంపల్లిని మరింత అభివృద్ధి దిశగా నడిపించే బాధ్యత తనదేనని శంకరయ్య నమ్మకం వ్యక్తం చేశారు. “ప్రతి ఇంటి అభివృద్ధి, ప్రతి ఒక్కరి పురోగతి నా లక్ష్యం” అని తెలిపారు.

# జమ్మికుంటలో దళిత బంధు రెండో విడత నిధుల జాప్యం లబ్ధిదారుల ఆగ్రహం వ్యక్తం

› దళితులపై వివక్ష ఆపాలని డిమాండ్




**సామాన్యుడి అస్త్ర, జమ్మికుంట:** జమ్మికుంట మండలంలో దళిత బంధు రెండో విడత నిధులు లబ్ధిదారులకు అందకపోవడంతో మండల వ్యాప్తంగా దళితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలు కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, దళితులను ఎందుకు బాధ పెడుతున్నారో ప్రశ్నిస్తున్నారు. దళిత బంధు పోరాట సమితి సభ్యులు తెలిపారు"మా దళితులపై విచక్షణరహితంగా వేధింపులు, అంతులేని వెరిఫికేషన్లు ఎందుకు? ఇప్పటికే యూనిట్లు నష్టపోయిన మా కుటుంబాలపై ఈ అనవసర అడ్డంకులు వేయడం అర్థరహితం. ఎవరో నాయకుడిపై కోపం మా దళితులపై చూపుతున్నట్లుంది" అని మండిపడ్డారు. కొంతమంది దళిత బంధు నిధులను హవాలా నిధులుగా అభివర్ణించడం పట్ల కూడా వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "వేల ఏళ్లుగా వెలివేయబడిన జాతులం స్వతంత్ర భారత్‌లో మొదటిసారి 100% సబ్సిడీతో మా జీవితాలు మార్చే పథకం వచ్చింది. మీ జేబులోని డబ్బు కాదు ప్రభుత్వ పథకం. ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేస్తే తగిన సమాధానం ఇస్తాం" అని హెచ్చరించారు. దళిత బంధు వచ్చిందన్న కారణంతో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ వికాస్ లాంటి ఇతర పథకాలు కూడా దళితులకు ఇవ్వకపోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ స్కీములు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇక మండలంలో దళారులు చెలరేగి దళితుల నుంచి కమిషన్ల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని, అందుకే చెక్కుల రూపంలోనే నిధులు ఇవ్వాలని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డైరీ ఫార్మ్ లాంటి యూనిట్ల మంజూరులో కూడా ఆడిట్ అబ్జెక్షన్ల పేరుతో అనవసర ఇబ్బందులు పెడుతున్నారని, వాటిని రద్దు చేసి యూనిట్లు వెంటనే ఆమోదించాలని కోరారు. దళిత బంధు పోరాట సమితి సభ్యుడు కోడెపాక రక్షిత్ జై భీమ్

# ఎమ్మెల్యే ఔదార్యం రైతు కన్నీరు తుడిచిన కౌశిక్ రెడ్డి





ఎద్దు చనిపోతే ఆవేదనలో మునిగిన రైతుకు వెంటనే కొత్త ఎద్దు కొనిచ్చిన ఎమ్మెల్యే

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన భాష వేన రాజయ్య అనే రైతు ఎంతో ప్రేమగా పెంచుకున్న ఎద్దు కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే చనిపోవడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయాడు. ఎద్దు కోల్పోవడం రైతుకు జీవనాధారమే కోల్పోయినట్టే. గ్రామస్తులంతా రాజయ్య పరిస్థితి చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇదే సమయంలో అక్కడి మార్గం గుండా ప్రయాణిస్తున్న హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విషయం తెలుసుకొని వెంటనే కారు ఆపి సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైతును ఓదార్చి, అతని పరిస్థితిని దగ్గరగా తెలుసుకున్నారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే కొత్త ఎద్దును స్వయంగా కొనుగోలు చేసి గ్రామానికి తీసుకువచ్చి రైతు రాజయ్యకు అందజేశారు. ఈ అఘటితంలో నిస్సహాయంగా ఉన్న రైతుకు ఇది కన్నీటి సంతోషాన్ని ఇచ్చింది. గ్రామస్తులు ఎమ్మెల్యే ఔదార్యాన్ని అభినందించారు. అంతటితో ఆగని కౌశిక్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించి, ప్రమాదవశాత్తు చనిపోయిన ఎద్దుకు ప్రభుత్వ పరిహారం రైతుకు తక్షణం అందించాలని కోరగా, విద్యుత్ డి.ఈ వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "రైతులంటే నాకు ప్రత్యేకమైన అభిమానం ఉంది. రైతు బాధ అంటే నాకు వ్యక్తిగత బాధ. కే.సీ.ఆర్ రైతు సంక్షేమ పథకాలు నాకు ఆదర్శం. ఈ కుటుంబానికి నా వంతు సహాయం చేశాను" అని పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డి సేవాతత్పరతను చూసి మడిపల్లి గ్రామం మాత్రమే కాదు, మొత్తం నియోజకవర్గం ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. రైతు కన్నీరు తుడిచిన నాయకుడిగా మరొకసారి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు.

# కేబినెట్‌లో మార్పులు

హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి రెండేళ్లు కావస్తోంది. కానీ పూర్తి స్థాయి క్యాబినెట్ మాత్రం కొలువు తీరలేదు. అయితే, మంత్రివర్గ పూర్తి స్థాయి విస్తరణ దిశగా కాంగ్రెస్ సర్కార్ అడుగులు వేస్తోంది. డిసెంబర్ తొలి వారంలోనే మరో రెండు మంత్రి పదవులను భర్తీ చేయడంతో పాటు, ప్రస్తుత మంత్రుల్లో కొందరికి ఉద్వాసన పలికి, మరికొందరికి అమాత్యుల పట్టం కట్టవచ్చని హస్తం ముఖ్య నేతలు చెబుతున్నారు. అయితే, అమాత్యులుగా ఎవరు 'ఇన్', ఎవరు 'ఔట్' అన్న ఉత్కంఠ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. మంత్రుల శాఖల్లోనూ మార్పు ఉంటుందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో విస్తృతంగా సాగుతోంది.జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక సందర్భంలో కాంగ్రెస్ హైకమాండ్ మైనార్టీ కోటాలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టింది. గత కొన్నాళ్లుగా మైనార్టీ వర్గానికి మంత్రి పదవి దక్కలేదన్న చర్చకు అజారుద్దీన్ ద్వారా ఫుల్ స్టాప్ పెట్టింది. దీంతో ప్రస్తుతం తెలంగాణ మంత్రుల సంఖ్య 16కు చేరింది. చట్ట ప్రకారం 18 మంది మంత్రులుగా పదవీ స్వీకారం చేయాల్సి ఉంది. మరో రెండు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. మిగిలి ఉన్న ఈ రెండు స్థానాలను భర్తీ చేయడం ద్వారా అన్ని వర్గాలను, ప్రాంతాలను సంతృప్తి పరచాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. సామాజిక న్యాయ సూత్రాన్ని అనుసరించి ఈ రెండు బెర్తులను ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ లేదా బీసీ వర్గాలలోని కీలకమైన ఉపవర్గాలకు కేటాయించే అవకాశం ఉందని కాంగ్రెస్ ముఖ్య నేతలు చెబుతున్నారు. అయితే, ఈ బెర్తులు దక్కించుకోవడానికి సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.పీసీసీ చీఫ్ బి. మహేష్ కుమార్ గౌడ్, ఆది శ్రీనివాస్, విజయశాంతి వంటి కీలక నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిలో ఒక మహిళకు అవకాశం ఇవ్వాలనే అంశాన్ని కూడా అధిష్టానం పరిశీలిస్తోందని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విస్తరణ కేవలం రాజకీయంగానే కాకుండా, రాష్ట్ర పరిపాలనను మరింత చురుకుగా మార్చడానికి అనుభవం ఉన్నవారిని ఎంచుకోవడంపై కూడా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న రెండు స్థానాల భర్తీయే కాకుండా, కొందరు మంత్రుల శాఖలను మార్చే అవకాశం ఉందన్న చర్చ ప్రస్తుతం హాట్ హాట్‌గా సాగుతోంది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రుల పని తీరుపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు హైకమాండ్ సమీక్ష చేసినట్లు సమాచారం. ఆశించిన స్థాయిలో పని తీరు కనపర్చని మంత్రులకు ఉద్వాసన పలుకుతారన్న చర్చ సాగుతోంది. మరో మూడేళ్ల పాటు పాలనను పరుగులెత్తించాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, అందుకు అనుగుణంగా మంత్రులుగా సమర్థులైన వారికి అవకాశం ఇవ్వాలన్న యోచనలో ఉన్నట్లు చెబుతున్నారుశాఖల మార్పులు కూడా ఉంటాయన్నది హస్తం నేతల మాట. ఇప్పటికే విద్య, మున్సిపల్, హోం వంటి ముఖ్యమైన శాఖలు సీఎం చెంతనే ఉన్నాయి. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న వారి శాఖలను మార్చే అవకాశం లేకపోలేదన్న చర్చ నడుస్తోంది. మంత్రి శ్రీధర్ బాబుకు హోం మంత్రిగా అవకాశం ఇవ్వవచ్చన్న ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది.

**ఎవరిపై వేటు? ఎవరికి అవకాశం?**

అయితే, ప్రస్తుతం ఎవరికి అవకాశం ఇస్తారు, ఎవరికి క్యాబినెట్ నుంచి ఉద్వాసన చెబుతారన్న దానిపై పూర్తి స్పష్టత లేకున్నా, పార్టీలో మాత్రం కొందరి పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖను తప్పించి, ఆమె స్థానంలో బీసీ మహిళ కోటాలో విజయశాంతికి అవకాశం కల్పిస్తారన్న ప్రచారం సాగుతోంది. ప్రస్తుత పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటారని తెలుస్తోంది. తద్వారా తన సన్నిహితుడికి అవకాశం కల్పించడమే కాకుండా, బీసీలకు ప్రాముఖ్యత ఇచ్చినట్లుంటుందన్న చర్చ సాగుతోంది. ఇక సీఎంతో నేరుగా తలపడిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఉద్వాసన తప్పదన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో సాగుతోంది. ఆయన స్థానంలో మరో బలమైన సామాజిక వర్గం నుంచి అవకాశం ఇస్తారని చెబుతున్నారు. మల్ రెడ్డి రంగారెడ్డికి అవకాశం ఉందన్న ప్రచారం ఉంది.ఇక కోమటి రెడ్డి వెంకటరెడ్డిని తొలగించి ఆయన స్థానంలో కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డికి అవకాశం ఇవ్వవచ్చన్న చర్చ నడుస్తోంది. గత కొంత కాలంగా రాజగోపాల్ రెడ్డి పార్టీపై అసంతృప్తి వెళ్లగక్కుతున్న విషయం తెలిసిందే. తనకు మంత్రి పదవి ఇస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని, మాట నిలబెట్టుకోలేదని విమర్శలు చేస్తున్నారు. ఈ టైంలో 'కుటుంబానికి ఒకే పదవి' అన్న పార్టీ లైన్ ప్రకారం కోమటి రెడ్డి వెంకటరెడ్డిని తొలగించి, ఆయన సోదరుడు రాజ్ గోపాల్ రెడ్డికి అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది. తద్వారా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్న పేరు వస్తుందన్న ఆలోచనలో హై కమాండ్ ఉన్నట్లు సమాచారం.మంత్రి విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణ ఈ డిసెంబర్ మొదటి వారం లేదా జనవరిలో పూర్తిస్థాయి కేబినెట్ కొలువుదీరే అవకాశం ఉంది. ఈ నిర్ణయాలు కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్తు రాజకీయ వ్యూహానికి, పరిపాలనా సామర్థ్యానికి ప్రతీకగా నిలవనున్నట్లు హస్తం నేతలు చెబుతున్నారు.

## మల్యాల గ్రామంలో దుర్గాదేవి ఫర్టిలైజర్స్ సీడ్స్ షాప్‌కు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రారంభం



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట :**మల్యాల గ్రామంలో దుర్గాదేవి ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ సీడ్స్ దుకాణాన్ని శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండాలని అన్నారు.కార్యక్రమంలో మాజీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎంపీపీ పావని వెంకటేష్, మాజీ ఎంపిటిసి చుక్క రంజిత్, మల్యాల గ్రామ బీఆర్ఎస్ విలేజ్ ప్రెసిడెంట్ మ్యాదరి నరేందర్, పిఎసిఎస్ చైర్మన్ ఉప్పుల తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఉడత వీరస్వామి, గండు పరుశురాం, తాడం మహేందర్, యూత్ లీడర్ గూడెపు నాగరాజ్ (ఆర్ఎంపి), గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు. షాప్ ప్రారంభించిన అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

## పూడికతో నిండిన చిన్నకాలువలు యసంగి ఆయకట్టుకు ఆటంకం

ఇరిగేషన్ వెంకట్రామిరెడ్డికి వంగ రామకృష్ణ వినతిపత్రం



**సామాన్యుడి అస్త్రంఇల్లందకుంట:** మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంగ రామకృష్ణ ఈరోజు హుజురాబాద్ నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 16 కెనాల్ పరిధిలోని జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల చిన్నకాలువలు తీవ్రంగా పూడికతో నిండిపోవడంతో చెట్లు పెరిగి, యసంగి పంటలకు చివరి ఆయకట్టు వరకూ నీరు చేరక రైతులు భారీ నష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.త్వరితగతిన పూడికతీసే పనులు చేపట్టి చెట్లు, మట్టి తొలగించి నీటిసరఫరా సౌకర్యం కల్పించాలని ఆయన ని కోరారు.

## బెల్ట్ షాపులపై మెరుపు దాడి ఎస్సై క్రాంతికుమార్

**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట :** ఇల్లందకుంట: మండలంలోని బెల్ట్ షాపులపై ఇల్లంతకుంట ఎస్సై క్రాంతికుమార్ మెరుపు దాడులు నిర్వహించారు. సీతంపేట గ్రామానికి చెందిన బుద్ధి సమ్మయ్య (65), మల్లయ్య, కులం యాదవ్ అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు లభించిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేశారు.దాడిలో 17.6 లీటర్ల మద్యం, దాని విలువ ?6,100 స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠినంగా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై క్రాంతికుమార్ హెచ్చరించారు.

## తెలంగాణలో మరో కొత్త రైల్వే స్టేషన్

హైదరాబాద్

మల్కాజ్‌గిరి పరిధిలోని రాధాకృష్ణ నగర్ (ఆర్కే నగర్) కాలనీ పేరును నూతన రైల్వే స్టేషన్‌కు పెట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి ఫలితంగా ఇది సాధ్యమైంది. ఈ స్టేషన్‌ను చర్లపల్లి–బొల్లారం మార్గంలో దయానంద్‌నగర్ స్టేషన్‌తో పాటు అమృత్ భారత్ పథకం కింద నిర్మిస్తున్నారు. ఈ స్టేషన్ అందుబాటులోకి వచ్చాక.. ఇక్కడ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను ఆపడానికి ప్లాట్‌ఫామ్‌ను విస్తరిస్తున్నారు. ప్రయాణికులు అదనంగా ఓటూ రైళ్లు, ఇతర ఎక్స్‌ప్రెస్‌లు, అలాగే ఆర్టీసీ బస్సు సర్వీసుల కోసం విజ్ఞప్తి చేస్తున్నారు.మల్కాజ్‌గిరి సర్కిల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్‌కు తమ కాలనీ పేరును పెట్టడంపై రాధాకృష్ణ నగర్ (ఆర్కే నగర్) కాలనీ ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కాలనీ పేరునే రైల్వే స్టేషన్‌కు ఖరారు చేయడం తమకు గర్వకారణమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైల్వే మరియు రాష్ట్ర ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకొని ముందుకు సాగడం.. అలాగే కాలనీ సభ్యుల సహకారంతోనే ఆర్కే నగర్ పేరు పెట్టడం సాధ్యమైందని వివరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ పాల్గొన్నారు.హైదరాబాద్ నగరంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి, ఇతర ప్రాంతాలకు రైలు కనెక్టివిటీని పెంచడానికి అనేక రైల్వే స్టేషన్లు కృషి చేస్తున్నాయి. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ వంటి రద్దీ స్టేషన్లతో పాటు.. ఇటీవల రూ. 450 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ కూడా అందుబాటులోకి వచ్చింది. వీటితో పాటు లింగంపల్లి, బేగంపేట, మల్కాజిగిరి స్టేషన్ల నుంచి కూడా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి.తాజాగా.. నగరంలో రెండు కొత్త రైల్వే స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ స్టేషన్లు చర్లపల్లి – మౌలాలి – బొల్లారం మార్గంలో ఆర్కేనగర్ మరియు దయానంద్‌నగర్ వద్ద నిర్మిస్తున్నారు. ఈ రెండు స్టేషన్లలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిర్మాణ పనులను ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఆర్కేనగర్ స్టేషన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత.. ఇక్కడ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను ఆపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీని కోసం 21 కోచ్‌లకు సరిపడా ప్లాట్‌ఫామ్‌ను విస్తరిస్తున్నారు. ఆర్కేనగర్ స్టేషన్‌లో అదనంగా ఆదిలాబాద్–తిరుపతి, విశాఖపట్నం–నాందేడ్, నర్సాపూర్–నాగర్‌సోల్, విశాఖపట్నం–షిర్డీ సాయినగర్, నాగావళి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లను కూడా ఆపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బరువు తగ్గాలని డైట్ చేస్తున్నారా?




బరువు తగ్గాలని ప్రతి ఒక్కరూ కలలు కంటారు. కానీ చాలామంది త్వరగా తగ్గాలనే ఆత్రంలో శరీరాన్ని శిక్షిస్తారు. రోజుకు 500-1000 క్యాలరీలు తినడం, జిమ్‌లో చచ్చేలా వర్కౌట్, రాత్రిపూట ఆకలితో కళ్లు పడుకోవడం.. ఇవన్నీ మొదట్లో ఫలితాలు చూపిస్తాయి. బరువు తగ్గాలని ప్రతి ఒక్కరూ కలలు కంటారు. కానీ చాలామంది త్వరగా తగ్గాలనే ఆత్రంలో శరీరాన్ని శిక్షిస్తారు. రోజుకు 500-1000 క్యాలరీలు తినడం, జిమ్‌లో చచ్చేలా వర్కౌట్, రాత్రిపూట ఆకలితో కళ్లు పడుకోవడం.. ఇవన్నీ మొదట్లో ఫలితాలు చూపిస్తాయి. కానీ చివరికి అలసట, కోపం, హార్మోన్ల గందరగోళం, మళ్లీ బరువు పెరగడం తప్ప శాశ్వత ఫలితం కనిపించదు. క్యాలరీ డెఫిసిట్ పేరుతో చాలా మంది క్రాష్ డైట్ చేస్తున్నారు తప్ప, ఆరోగ్యకరమైన డెఫిసిట్‌లో లేరు. కొవ్వు తగ్గడానికి అతి ముఖ్యమైన శాస్త్రీయ పద్ధతి క్యాలరీ డెఫిసిట్.ఒక వ్యక్తి శరీరం రోజులో ఖర్చు చేసే క్యాలరీల కంటే తక్కువ క్యాలరీలు ఆహారం ద్వారా తీసుకుంటే, శరీరం నిల్వ ఉన్న కొవ్వును శక్తి కోసం వినియోగించుకుంటుంది. దీన్నే క్యాలరీ డెఫిసిట్ అంటారు. అయితే, ఈ డెఫిసిట్ ఆరోగ్యకరంగా, స్థిరంగా ఉండాలి. లేదంటే శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. శరీర బరువు వారానికి 0.4 నుంచి 0.9 కేజీల మధ్య తగ్గితే మంచిదే. రోజుకూ1 కేజీ హెచ్చుతగ్గులు వచ్చినా భయపడాల్సిన పని లేదు. నీరు, గ్లైకోజెన్, మలినాల వల్ల వస్తాయి. 3-4 వారాల తర్వాత కూడా ఇదే క్రమంలో బరువు తగ్గితే మీరు పాటించే డైట్? సరైనదే. మధ్యాహ్నం, రాత్రి భోజనాల మధ్య 3-4 గంటలకు సమయంలో కడుపులో ఆకలి తెలుస్తుంది. ఇది సహజం, అలా జరిగితే శరీరం నిల్వ ఉన్న కొవ్వును వాడుతోందని సంకేతం. కానీ చేతులు వణుకడం, తలతిరగడం, చిరాకు, లేదా ఏదైనా తినకపోతే చచ్చిపోతాను అనిపిస్తే డెఫిసిట్ చాలా ఎక్కువైందని అర్థం. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆఫీసు పని, వ్యాయామం, పిల్లలతో ఆటలు అన్నీ సాఫీగా చేయగలగాలి. మధ్యాహ్నం 3 గంటలకే కళ్లు మూసుకుపోతున్నాయి అనిపిస్తే కార్బ్స్ లేదా శరీరానికి క్యాలరీలు తక్కువయ్యాయని గ్రహించాలి.శరీర బరువులో 5-10 తేడా కనిపించవచ్చు, కానీ 3-4 వారాల్లోనే మళ్లీ పైకి వెళ్లాలి. ఒక్కసారిగా 20-30 బలం తగ్గితే కావాల్సిన దానికంటే తక్కువ తింటున్నారు అని గ్రహించాలి. ఒక్కోసారి చిరాకు లేదా లైట్ ఎమోషనల్ డౌన్ రావచ్చు, కానీ రోజూ ఏడుపు, కోపం, లేదా ఈ డైట్ వల్ల నా జీవితం నాశనమైంది అనే ఆలోచనలు వస్తే డెఫిసిట్ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.10 నిమిషాల్లో నిద్రపట్టడం, రాత్రి మధ్యలో ఆకలితో మేలుకోకపోవడం, ఉదయం 6-7 గంటలకు సహజంగా కళ్లు తెరుచుకోవడం ఇవన్నీ ఆరోగ్యకరమైన డెఫిసిట్ గుర్తులు.సాయంత్రం 6 గంటలకు ప్రోటీన్ షేక్ తాగాలి అని గుర్తుండటం సహజం.

# చలికాలంలో ఎండుద్రాక్షలు తింటే..



శీతాకాలపు చలి తెలివైన పోషణను కోరుకుంటుంది, మరియు నానబెట్టిన ఎండుద్రాక్ష (కిస్‌మిస్) అనేది శాస్త్రీయంగా కూడా నిరూపించబడిన ఒక శక్తివంతమైన సాంప్రదాయ ఆహారం. పోషకాలు సమృద్ధిగా ఉన్న ఈ రత్నాలు అవసరమైన ఖనిజాలు యాంటీఆక్సిడెంట్లతో జీర్ణక్రియను పెంచుతాయి, ఎముకలను బలోపేతం చేస్తాయి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటిని రోజూ తీసుకోవడం స్థిరమైన శక్తికి గుండె ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది, ఇది మీ చలికాలపు ఆహారంలో ఒక ముఖ్యమైన అదనంగా మారుతుంది.శీతాకాలంలో, చల్లటి ఉష్ణోగ్రతలు, తగ్గిన సూర్యరశ్మి రోజువారీ కార్యకలాపాలలో మార్పుల కారణంగా సమతుల్య పోషణను నిర్వహించడం చాలా అవసరం. నానబెట్టిన ఎండుద్రాక్ష లేదా కిస్‌మిస్‌ను ప్రతిరోజూ తీసుకోవాలని సాంప్రదాయ పద్ధతులు ప్రోత్సహిస్తాయి, దీనికి ఆధునిక పోషకాహార శాస్త్రం మద్దతు ఇస్తుంది. నానబెట్టిన ఎండుద్రాక్షలో ఫైబర్, అవసరమైన ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు మరియు సహజ చక్కెరలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శక్తి స్థాయిలు, జీర్ణక్రియ మరియు రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి మద్దతు ఇచ్చే పోషకాలను అందిస్తాయి. నానబెట్టిన ఎండుద్రాక్షను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చల్లటి నెలల్లో అనేక ప్రయోజనాలు లభిస్తాయని 'న్యూట్రియంట్స్'లో ప్రచురించబడిన శాస్త్రీయ పరిశోధనలు సూచిస్తున్నాయి. ఎండుద్రాక్షలో అధిక మొత్తంలో డైటరీ ఫైబర్ ఉంటుంది, ఇది ఆరోగ్యకరమైన ప్రేగు పనితీరును ప్రోత్సహిస్తుంది. తయారీ సమయంలో నీటిని గ్రహించే నానబెట్టిన ఎండుద్రాక్ష, మృదువుగా మరియు జీర్ణం చేసుకోవడానికి సులభంగా మారుతుంది. దీంతో పోషకాలు మరింత సమర్థవంతంగా గ్రహించబడతాయి. ఎండుద్రాక్షలోని కరిగే ఫైబర్ సహజ చక్కెరలు శక్తిని స్థిరంగా విడుదల చేస్తాయి. శీతాకాలంలో మనం ఎక్కువ భోజనం చేసినప్పుడు, ఈ లక్షణం జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. శీతాకాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కీలకమైన ఖనిజాలు ఎండుద్రాక్షలో పుష్కలంగా ఉన్నాయి. ఐరన్ (ఇనుము): ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తికి రక్తంలో ఆక్సిజన్ రవాణాకు అవసరం, ఇది శక్తిని నిలబెట్టడానికి అలసటను తగ్గించడానికి సహాయపడుతుంది. కాల్షియం బోరాన్: ఇవి ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనవి. బోరాన్ కాల్షియం శోషణ మరియు వినియోగానికి తోడ్పడుతుంది. నానబెట్టిన ఎండుద్రాక్షను క్రమం తప్పకుండా తీసుకోవడం ఈ ఖనిజాలకు సహజ వనరుగా పనిచేస్తుంది, ఎముకల సాంద్రతకు, కీళ్ల పనితీరుకు మొత్తం రక్త ప్రసరణ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది.ఎండుద్రాక్షలో ఫినోలిక్ పాలీఫెనోలిక్ సమ్మేళనాలు ఉంటాయి, ఇవి యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి, శరీరానికి ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించడానికి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడతాయి. చల్లటి వాతావరణం, తక్కువ సూర్యరశ్మి వలన రోగనిరోధక వ్యవస్థ సవాలు చేయబడుతుంది. ఎండుద్రాక్షలోని యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తికి మద్దతు ఇస్తాయి, మంటను తగ్గిస్తాయి చల్లటి నెలల్లో మొత్తం శరీర స్థితిస్థాపకతకు దోహదం చేస్తాయి. ఎండుద్రాక్షను క్రమం తప్పకుండా తీసుకోవడం గుండె ఆరోగ్యం జీవక్రియ ఆరోగ్యానికి మెరుగుదలలకు దోహదం చేస్తుందని క్లినికల్ ట్రయల్స్ సూచిస్తున్నాయి. ఎండుద్రాక్ష తీసుకోవడం సిస్టోలిక్ రక్తపోటును తగ్గిస్తుందని మరియు తక్కువ-సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరుస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. శీతాకాలంలో ఈ గుండె జీవక్రియ ప్రయోజనాలు చాలా ముఖ్యమైనవి.

# అబార్షన్ తర్వాత ఈ ఫుడ్స్ తిన్నారంటే..




ప్రతి అమ్మాయికీ మాతృత్వ భావన ప్రత్యేకమైనది. అయితే అందరు ఆడపిల్లలు తల్లులు కావాలని కోరుకోరు. ముఖ్యంగా నేటి తరం యువతులు చాలా మంది కెరీర్ తొలినాళ్లలో పిల్లలను కోరుకోవడం లేదు. వారు జీవితంలో స్థిరపడాలని, వారి స్వంత జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో త్వరగా తల్లి అవడానికి ఇష్టపడటం లేదు. కొన్నిసార్లు గర్భస్రావం స్వచ్ఛందంగా, కొన్నిసార్లు పరిస్థితుల ద్వారా బలవంతంగా అవుతుంది. ప్రతి అమ్మాయికీ మాతృత్వ భావన ప్రత్యేకమైనది. అయితే అందరు ఆడపిల్లలు తల్లులు కావాలని కోరుకోరు. ముఖ్యంగా నేటి తరం యువతులు చాలా మంది కెరీర్ తొలినాళ్లలో పిల్లలను కోరుకోవడం లేదు. వారు జీవితంలో స్థిరపడాలని, వారి స్వంత జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో త్వరగా తల్లి అవడానికి ఇష్టపడటం లేదు. కొన్నిసార్లు గర్భస్రావం స్వచ్ఛందంగా, కొన్నిసార్లు పరిస్థితుల ద్వారా బలవంతంగా అవుతుంది. అబార్షన్ తర్వాత శరీరం కూడా చాలా బలహీనంగా మారుతుంది. మందులు లేదా ఆపరేషన్ల ద్వారా అబార్షన్ చేసినా, అధిక రక్తస్రావం జరుగుతుంది. శరీరం తీవ్రంగా బలహీనపడుతుంది. శరీరంలో ఐరన్ లోపం ఏర్పడుతుంది. మైకం, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అబార్షన్ తర్వాత.. శరీరం ఆరోగ్యం కోలుకోవడానికి సహకరించే మందులను మాత్రమే వైద్యులు ఇస్తారు. కానీ ఈ పరిస్థితిలో శరీరం, మనస్సు రెండింటినీ జాగ్రత్తగా చూసుకోవాలి. మెడిసిన్‌తో పాటు ఎలాంటి ఆహారాన్ని తీసుకుంటే సాధారణ జీవితం తిరిగి ప్రారంభమవుతుంది.రోజువారీ ఆహారంలో ఐరన్, విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలు తప్పనిసరిగా ఉండాలి. ఇది సంక్రమణ ప్రమాదాన్ని నివారిస్తుంది. రక్తంలో ఎర్ర రక్త కణాల మొత్తాన్ని పెంచుతుంది. ఖర్జూరం, బాదం, పాలకూర, దుంపలు, క్యారెట్లు, సిట్రస్ పండ్లు, యాపిల్స్ మొదలైన వాటిని తినవచ్చు.


అబార్షన్ తరువాత శరీరంలో ఇరన్ లోపం ఏర్పడుతుంది. ఈ సమయంలో ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఇది మిమ్మల్ని డిప్రెషన్ నుంచి బయటపడేయడానికి, ఎర్ర రక్త కణాల స్థాయిలను పెంచడానికి సహాయపడుతుంది. ఈ సమయంలో బాదం, అక్రోట్లను అధికంగా తినాలి. అలాగే కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని కూడా తీసుకోవాలి. కాల్షియం గర్భస్రావం తర్వాత శరీరాన్ని పునరుద్ధరించడానికి సహాయపడుతుంది. ఈ సమయంలో పాలు, డ్రై ఫ్రూట్స్, టోఫు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. తృణధాన్యాలు జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. గర్భస్రావం తర్వాత జీర్ణ సమస్యలను తగ్గించుకోవడానికి ఓట్స్, బ్రౌన్ రైస్, క్వినోవా వంటి ఆహారాలను తీసుకోవాలి. అంతేకాకుండా చికెన్, చేపలను తప్పనిసరిగా ఆహారంలో ఉంచుకోవాలి.

# 2 అరటిపండ్లు చాలు.. గుండె నుంచి బరువు కంట్రోలుకు!



అరటిపండ్లు మార్కెట్‌లో చవకగా అన్ని కాలాల్లోనూ దొరికే సూపర్ ఫుడ్. అయినప్పటికీ వీటిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడానికి చాలామంది పెద్దగా ఆసక్తి చూపరు. అయితే రోజుకు ఒకటి కాదు, రెండు అరటిపండ్లు తినడం వల్ల మన శరీరానికి శక్తి నుండి గుండె ఆరోగ్యం వరకు అనేక అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.తక్షణ శక్తి: అరటిపండ్లు తక్షణ శక్తిని అందించడంలో అగ్రస్థానంలో ఉంటాయి. వీటిలో ఉండే సహజ చక్కెరలు, ఫైబర్, శరీరానికి రోజంతా అవసరమైన శక్తిని అందిస్తాయి. దాంతో అలసటను తగ్గిస్తాయి. అందుకే జిమ్‌కు వెళ్లేవారు, అథ్లెట్లు వ్యాయామానికి ముందు, తర్వాత వీటిని తీసుకోవడానికి ఇష్టపడతారు.

గుండె ఆరోగ్యం - జీర్ణక్రియ: రోజుకు రెండు అరటిపండ్లు తినడం వల్ల గుండెకు ఎంతో మేలు జరుగుతుంది. అరటిపండ్లలో ఉండే పొటాషియం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది రక్తపోటును నియంత్రించి, గుండెపోటు, ఇతర గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. వీటిలోని అధిక ఫైబర్ కంటెంట్ ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఇది మలబద్ధకం సమస్యను సమర్థవంతంగా తగ్గిస్తుంది. మానసిక ప్రశాంతత: అరటిపండ్లు కేవలం శరీరానికే కాదు, మనసుకూ మేలు చేస్తాయి. అరటిపండ్లలోని ట్రిప్టోఫాన్ అనే పదార్థం మంచి అనుభూతిని కలిగించే హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది మీ మానసిక స్థితిని మెరుగుపరచడంలో, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరంలో ఐరన్ లోపం వల్ల వచ్చే రక్తహీనత సమస్య ఉన్నవారికి అరటిపండ్లు చాలా మంచివి. వీటిలో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి. మానసిక ప్రశాంతత: అరటిపండ్లు కేవలం శరీరానికే కాదు, మనసుకూ మేలు చేస్తాయి. అరటిపండ్లలోని ట్రిప్టోఫాన్ అనే పదార్థం మంచి అనుభూతిని కలిగించే హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది మీ మానసిక స్థితిని మెరుగుపరచడంలో, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరంలో ఐరన్ లోపం వల్ల వచ్చే రక్తహీనత సమస్య ఉన్నవారికి అరటిపండ్లు చాలా మంచివి. వీటిలో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి.



# ఇష్టమని పిస్తా పప్పు ఇలా తిన్నారంటే!

శీతాకాలంలో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఈ సమయంలో ఆరోగ్య సంబంధిత సమస్యలు దాడి చేస్తాయి. కాబట్టి ఈ కాలంలో వీలైనంత జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అందుకే ఆరోగ్య నిపుణులు శీతాకాలంలో సాధ్యమైనంత ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని చెబుతుంటారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో వేరుశెనగ పప్పు, బాదంతో పాటు పిస్తాపప్పులు తినడం కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే వీటిని మితంగా మాత్రమే తీసుకోవాలి. కొంత మందికి పిస్తా పప్పు విషయంలో కొన్ని అపోహలు ఉంటాయి. వీటిని తినడం వల్ల బరువు పెరుగుతారని అనుకుంటారు. అందుకే పిస్తాపప్పులు తీసుకోవడానికి ఇష్టపడరు. కానీ ఆరోగ్య నిపుణులు మాత్రం రోజులో మితంగా పిస్తా పప్పు తీసుకోవడం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుందని అంటున్నారు. డ్రై ఫ్రూట్స్ కోవకు చెందిన పిస్తాపప్పులో పోషకాలు సమృద్ధిగా ఉండటమే కాకుండా అధిక ఫైబర్, ప్రోటీన్లు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆకలిని తగ్గిస్తుంది. తద్వారా ఇతర ఆహారాలను మితంగా తినేలా చేస్తుంది. ఇవి ఆరోగ్యకరంగా బరువును నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది. అంతేకాదు, పిస్తాపప్పులు మోనోశాచురేటెడ్ కొవ్వు ఆమ్లాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరంలోని వాపు సమస్యను తొలగించడంలో సహాయపడుతుంది. సాధారణంగా పిస్తాపప్పులను క్రమం తప్పకుండా తినడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. కానీ ఆరోగ్య నిపుణులు వాటిని ఎక్కువగా తినకూడదని హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే వీటిని ఎక్కువగా తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. ప్రతి ఉదయం ఐదు నుంచి ఏడు పిస్తాపప్పులు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అయితే 7 అంత కంటే ఎక్కువ పిస్తాపప్పులు తినడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. ముఖ్యంగా దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు పిస్తాపప్పుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. సాధారణంగా పిస్తాపప్పులు రుచికి భలేగా ఉంటాయి.



# ఎవరూ ఊహించి ఉండరు..

**మోహన్ లాల్ దృశ్యం 3 థియాట్రికల్, డిజిటల్ రైట్స్ ఎంతో తెలిస్తే షాకవ్వాల్సిందే!**

మాలీవుడ్‌లో తెరకెక్కి.. పలు భాషల్లో విడుదలై టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచిన చిత్రాల్లో ఒకటి దృశ్యం మలయాళంలో క్రైం థ్రిల్లర్ జోనర్‌లో వచ్చిన ఈ మూవీకి జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించాడు. ఈ ఫ్రాంచైజీలో దృశ్యం 3 కూడా వస్తోన్న విషయం తెలిసిందే. మోహన్ లాల్ మీనా లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా సెట్స్‌పై ఉండగానే ఈ చిత్రం థియాట్రికల్, డిజిటల్ రైట్స్ విషయంలో హాట్ టాపిక్‌గా నిలుస్తోంది. దృశ్యం 3 థ్రియాట్రికల్, డిజిటల్ రైట్స్ కలిపి ఏకంగా రూ.350 కోట్లు పలికాయని మాలీవుడ్ సర్కిల్ సమాచారం. ఇప్పటివరకు ఇదే టాప్ ఫిగర్ కాగా.. మలయాళ ట్రేడ్ ఎనలిస్టులు ఎవరూ కూడా ఊహించని విధంగా రికార్డు స్థాయిలో రైట్స్ అమ్ముడుపోయి అరుదైన ఫీట్ నమోదు చేసింది దృశ్యం 3. జార్జ్‌కుట్టీ (మోహన్ లాల్ పాత్ర) ఫ్యామిలీ చుట్టూ తిరిగే కథతో తెరకెక్కిన దశ్యం ఫ్రాంచైజీలో వచ్చిన రెండు పార్టులు ఇప్పటికే బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఫస్ట్ పార్ట్ థియేటర్‌లో విడుదలవగా.. రెండో పార్టు ఓటీటీలో విడుదలైంది. ఆశీర్వాద్ సినిమాస్ దశ్యం 3ని తెరకెక్కిస్తోంది. మరి మూడో పార్టు బాక్సాఫీస్‌ను ఏ స్థాయిలో షేక్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. దృశ్యం కథ తెలుగు, తమిళం, హిందీతోపాటు వివిధ భాషల ప్రేక్షకులకు కూడా బాగా కనెక్ట్ అయిందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటికే తెలుగులో వెంకటేశ్, హిందీ, తమిళం, కన్నడ భాషల్లో రీమేక్ అయి సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది.

## ఓటీటీలో వరుణ్ సందేశ్ ఎంట్రీ.. వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



కొత్తబంగారు లోకం హీరో వరుణ్ సందేశ్ ఓటీటీలో ఎంట్రీ ఇస్తున్నాడు. ఇతడు ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ వెబ్ సిరీస్ 'నయనం'. ఈ సిరీస్ జీ5లో డిసెంబర్ 19 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సైకో థ్రిల్లర్‌ను స్వాతి ప్రకాశ్ డైరెక్ట్ చేశారు. మనుషుల్లోని నిజ స్వభావానికి, ఏదో కావాలని తపించే తత్వానికి మధ్య ఉండే సున్నితమైన అంశాలను ఇందులో చూపించారు. సోమవారంనాడు ఈ సిరీస్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. డాక్టర్ నయన్ పాత్రలో వరుణ్ సందేశ్ కనిపించనున్నాడు. తన పాత్రలోని డార్క్ యాంగిల్, సైకలాజికల్ సంక్లిష్టతను ఇందులో ఆవిష్కరించారు. ఈ వెబ్ సిరీస్‌లో ఆరు ఎపిసోడ్స్ ఉండనున్నాయి. ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తోన్న వరుణ్ సందేశ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నటుడిగా నాకు ఇది సరికొత్త ప్రయాణం. ఇప్పటి వరకు చేయనటువంటి విభిన్నమైన పాత్రలో డాక్టర్ నయన్‌గా కనిపించబోతున్నాను. పోస్టర్ గమనిస్తే నా పాత్రలో ఇంటెన్సిటీ అర్థమవుతుంది. ఓటీటీలో యాక్ట్ చేయటం వల్ల ఇలాంటి పాత్రలో డెప్త్‌ను మరింతగా ఎలివేట్ చేసినట్లయింది అని పేర్కొన్నాడు.



# తమన్నా చేతికి మరో బిగ్ ఆఫర్

## ఆ బయోపిక్‌లో కీలక పాత్ర!

నటి తమన్నా భాటియా వరుసగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విభిన్నమైన పాత్రలతో జోరు మీద ఉన్నారు. ఇటీవల ఓదెలా 2లో శక్తివంతమైన పాత్రతో, అలాగే అజయ్ దేవగన్ నటించిన రైడ్ 2లో ఆకట్టుకునే రోల్‌తో ప్రేక్షకులను మెప్పించిన ఆమెకు ఇప్పుడు మరో బిగ్ ఆఫర్ వచ్చినట్టు చిత్ర పరిశ్రమలో టాక్ నడుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు ..వీ. శాంతారాం జీవితకథ ఆధారంగా బయోపిక్ రూపొందించనుండగా, అందులో తమన్నా ఒక ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. అందులో ఆమె, శాంతారం భార్య అయిన ప్రముఖ నటి సాంధ్య పాత్రను పోషించనున్నట్లు చెప్పుకుంటున్నారు. హిందీ, మరాఠీ సినిమాల్లో సాంధ్య ఓ ప్రముఖ నటి. వీ. శాంతారాం దర్శకత్వంలో ఆమె నటించిన అనేక చిత్రాలు అప్పట్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాయి. అందువల్ల సాంధ్య పాత్ర ఈ బయోపిక్‌లో అత్యంత ప్రాధాన్యమైనదిగా భావిస్తున్నారు. ఈ బయోపిక్‌కు "చిత్రపతి వీ. శాంతారాం" అనే టైటిల్ ఖరారు చేసినట్లు సమాచారం. బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ చతుర్వేది వీ. శాంతారాం పాత్రలో నటించనున్నాడు. ఆయన కెరీర్‌లో ఇది భిన్నమైన, ప్రతిష్టాత్మక పాత్ర అవుతుందని పరిశ్రమ అంచనా వేస్తోంది. ఈ చిత్రాన్ని 'నాటసామ్రాట్' సినిమాతో ప్రశంసలు అందుకున్న దర్శకుడు అభిజిత్ దేశ్‌పాండే తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలు, పాత్రల లోతును చూపడంలో ఆయనకు ఉన్న నైపుణ్యం దృష్ట్యా ఈ సినిమా కూడా ప్రత్యేకంగా నిలవొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కథ విన్న వెంటనే తమన్నా ఈ పాత్రపై ఆసక్తి చూపి అంగీకరించినట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా పాత్రలు ఎంపికకి కొత్త ప్రాధాన్యం ఇస్తున్న ఆమెకి, ఈ పాత్ర మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని సమాచారం. సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభంకానుంది. వీ. శాంతారాం సినీరంగానికి చేసిన సేవలు, ఆయన వినూత్న ప్రయోగాలు, వ్యక్తిగత జీవితం ఇలా ఎన్నో అంశాలను ఈ బయోపిక్‌లో చూపించనున్నారు. ఈ చిత్రం బాలీవుడ్‌లో మరో ప్రతిష్టాత్మక బయోపిక్‌గా నిలుస్తుందని, అలాగే తమన్నా నటనకు కొత్త మైలురాయి అవుతుందని అభిమానులు, ఫిల్మ్ సర్కిల్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

# హర్షిత్ రాణాకే క్రెడిట్.. కోహ్లీ భవిష్యత్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన టీమిండియా బ్యాటింగ్ కోచ్!

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో భారత జట్టు విజయం సాధించింది. బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ హర్షిత్ రాణా పాత్రపై ప్రశంసలు కురిపించారు. హర్షిత్ స్పెల్ మ్యాచ్‌ను మలుపు తిప్పిందని సితాన్షు తెలిపారు. హర్షిత్ తన ఓవర్‌లోనే ర్యాన్ రికెల్టన్, క్వింటన్ డి కాక్‌లను అవుట్ చేశాడు. ఆ తర్వాత డెవాల్డ్ బ్రెవిస్‌ను పెవిలియన్‌కు పంపాడు. హర్షిత్ పది ఓవర్లలో 65 పరుగులు ఇచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. తొలి వన్డేలో దక్షిణాఫ్రికాను 17 పరుగుల తేడాతో ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. రాంచీలోని జేఎస్‌సీఏ ఇంటర్నేషనల్ స్టేడియం కాంప్లెక్స్‌లో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్, విరాట్ కోహ్లీ సెంచరీ, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ అర్ధ సెంచరీలతో కదం తొక్కడంతో 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 349 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 332 పరుగులకు ఆలౌట్ అయింది. మాథ్యూ బ్రీట్జ్కే (72), మార్కో జాన్సెన్ (70), కార్బిన్ బాష్ (67) అర్ధ సెంచరీలు చేశారు. భారత్ తరఫున కుల్దీప్ యాదవ్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. హర్షిత్ రాణా మూడు వికెట్లు తీశాడు. అర్ష్‌దీప్ సింగ్‌కు రెండు వికెట్లు, ప్రసిద్ధ్ కృష్ణకు ఒక వికెట్ దక్కింది. హర్షిత్ ప్రదర్శనను కోటక్ ప్రశంసించాడు. ప్రారంభంలో వికెట్లు పడగొట్టకపోతే.. 350 పరుగుల లక్ష్యాన్ని భారత్ కాపాడుకోవడం అంత సులభం కాదని తెలిపాడు. తొలి వికెట్లు తీసినందుకు హర్షిత్‌కు చాలా క్రెడిట్ దక్కుతుందని పేర్కొన్నారు. మొదటి రెండు నుంచి ఐదు ఓవర్ల వరకు కూకబుర్రా బంతి నుంచి స్వింగ్ లభిస్తుందని.. దాన్ని అతను పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడని తెలిపాడు. ఈ



పిచ్‌పై 350 పరుగులు మంచి స్కోరేనని.. కానీ మంచు భారీగా ఉండడంతో బౌలర్లు బంతిని సరిగ్గా పట్టుకోలేకపోయారని తెలిపాడు. బంతి నేరుగా బ్యాట్‌పైకి వచ్చిందని చెప్పుకొచ్చాడు. మ్యాచ్‌లో హర్షిత్‌కు క్రెడిట్ ఇవ్వాల్సిందేనని.. ఎందుకంటే ప్రారంభంలో వికెట్లు తీసుకోకపోతే.. మ్యాచ్‌ను కాపాడుకోవడం కష్టమయ్యేదని చెప్పాడు. 50 ఓవర్ల క్రికెట్‌లో కోహ్లీ ఫిట్‌నెస్, ఫామ్ బాగుందని.. అతని వన్డే భవిష్యత్తుపై ఎలాంటి ఊహాగానాలు ఉండకూడదని సితాన్షు అభిప్రాయం వ్యక్తం చేశారు. కోహ్లీ భవిష్యత్తు గురించి చర్చ ఎందుకు జరుగుతుందో తనకు అర్థం కావడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మనం దీని గురించి ఎందుకు ఆలోచించాలో నాకు నిజంగా అర్థం కావడం లేదు. అతను ఇంత బాగా బ్యాటింగ్ చేస్తున్నాడు. మనం అతని భవిష్యత్తు గురించి ఎందుకు మాట్లాడాలి? అతను ప్రదర్శన ఇస్తున్న విధానం, అతని ఫిట్‌నెస్ ఎలా ఉందో, దేని గురించి కూడా ఎలాంటి ప్రశ్న లేదు. అతను ఇలాగే బ్యాటింగ్ చేస్తూనే ఉన్నంత కాలం.. వేరే దేని గురించి మాట్లాడటంలో అర్థం లేదు' అంటూ సితాన్షు స్పష్టం చేశారు.

## సచిన్ తనయుడికి ప్రమోషన్.. కట్ చేస్తే!



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ-2025లో సచిన్ టెండూల్కర్ తనయుడు, గోవా ఆల్‌రౌండర్ అర్జున్ టెండూల్కర్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. బౌలింగ్‌లో రాణిస్తున్నప్పటికి బ్యాటింగ్‌లో మాత్రం అర్జున్ తీవ్ర నిరాశపరుస్తున్నాడు. గత సీజన్‌లో లోయార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన అర్జున్‌కు ఈసారి గోవా టీమ్ మెనేజ్‌మెంట్ ఏకంగా ఓపెనర్‌గా ప్రమోషన్ ఇచ్చింది. కెరీర్‌లో తొలిసారి ఓపెనర్‌గా బరిలోకి దిగిన జూనియర్ టెండూల్కర్ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోతున్నాడు. ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడిన కేవలం 39 పరుగులు మాత్రమే చేశాడు. ఉత్తర్‌ప్రదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 28 పరుగులు చేసిన అర్జున్.. ఆ తర్వాత చండీగఢ్‌పై కేవలం 18 పరుగులతో సరిపెట్టుకున్నాడు. తాజాగా ఆదివారం హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 13 బంతులు ఆడి 7 పరుగులే చేశాడు. ఈ మ్యాచ్‌లో బౌలింగ్‌లో కూడా అర్జున్ సత్తాచాటలేకపోయాడు. యూపీపై కూడా అర్జున్ బ్యాట్‌తో పాటు బంతితో కూడా విఫలమయ్యాడు. కానీ చండీగఢ్‌పై మాత్రం 4 ఓవర్లలో కేవలం 17 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. దీంతో గోవా 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మిగితా రెండు మ్యాచ్‌లలో మాత్రం గోవా చిత్తు అయింది. ముంబై నుంచి తన మకాంను గోవాకు మర్చిన అర్జున్ ఇక్కడ కూడా తన మార్క్‌ను చూపించలేకపోతున్నాడు. మొన్నటివరకు కేవలం రెడ్ బాల్ క్రికెట్‌కు పరిమితమైన అర్జున్‌కు ఈసారి పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఆడే అవకాశం దక్కింది. కానీ తనకు దక్కిన అవకాశాన్ని అర్జున్ సద్వినియోగ పరుచుకోలేకపోతున్నాడు. కాగా ఐపీఎల్-2026లో అర్జున్ టెండూల్కర్ లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడనున్నాడు. మినీ వేలానికి ముందు అర్జున్‌ను ముంబై ఇండియన్స్ నుంచి లక్నో ట్రేడ్ చేసుకుంది.

## స్పోర్ట్స్

### భారత జట్టు ప్రాధేయపడాలా?.. బీసీసీఐ ఆదుకోకుంటే మీ టీమ్ ఉండేదా..?



టెస్టు సిరీస్‌లో భారత జట్టు ఓటమి అనంతరం దక్షిణాఫ్రికా కోచ్ షుక్రి కొన్రాడ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సునీల్ గవాస్కర్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. 'అంతర్జాతీయ క్రికెట్‌లో సఫారీ జట్టు పునరాగమనానికి భారత బోర్డు చేసిన సాయం మర్చిపోయావా? .. మీ దేశంలోని ఎస్ఏ20 లీగ్‌లో ఐదు ఫ్రాంచైజీలు భారతీయులవే అనే సంగతి గుర్తుంచుకో. ఏ రకంగా చూసినా మీబోర్డు, ఆటగాళ్లు భారత్ పట్ల కృతజ్ఞతగా చూపాలి' అని కొన్రాడ్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డాడు సన్నీ. ఒకప్పుడు సొగసైన తన ఆటతో.. ఇప్పుడు కామెంటేటర్‌గా ప్రేక్షకులను అలరిస్తున్ గవాస్కర్ జియో స్టార్‌లో మాట్లాడుతూ సఫారీ కోచ్‌కు చీవాట్లు పెట్టాడు. 'అంతర్జాతీయ క్రికెట్‌లో దక్షిణాఫ్రికా జట్టు పునరాగమనంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి పాత్ర ఎనలేనిది. అంతెందుకు.. మూడేళ్ల క్రితం మొదలైన %ూూ%20 లీగ్‌కు సైతం భారత బోర్డు అండగా ఉంది. ఈ లీగ్‌లోని ఐదు ఫ్రాంచైజీలు ఐపీఎల్ జట్లకు సంబంధించినవే. భారత పెట్టుబడిదారుల కారణంగానే చాలామంది సఫారీ క్రికెటర్లు అవకాశాలు దక్కించుకోగలుగుతున్నారు. కొన్రాడ్.. నీ వ్యాఖ్యలు ప్రపంచానికి చెడు సంకేతం ఇచ్చేలా ఉన్నాయి. ఒకసారి గతం గుర్తు చేసుకో. దాదాపు 20 ఏళ్లు మీ జట్టును దూరంగా పెట్టిన ఐసీసీని ఒప్పించడంలో భారత బోర్డు కీలకంగా వ్యవహరించింది. మీ జట్టు పునరాగమనంలో తొలి మ్యాచ్ కూడా భారత గడ్డపైనే ఆడింది. క్రికెట్ పరంగా భారత్, దక్షిణాఫ్రికాలు దశాబ్దాలుగా స్నేహభావంతో మెలుగుతున్నాయి. ఇరుజట్లు నువ్వానేనా అన్నట్టు పోటీపడుతుంటాయి. అంతేతప్ప.. శత్రుత్వం మచ్చుకైనా కనిపించదు. నువ్వు అనువుకాని వేళలో.. క్రికెట్‌ను ఎంతో ప్రేమించే గడ్డపై తప్పుడు మాట మాట్లాడావు. నిన్ను క్షమాపణలు చెప్పాలని నేను కోరను. కానీ, నీ పొరపాటును నువ్వు తెలుసుకుంటే మంచిది. ఆటలో కొన్నిసార్లు భావోద్వేగ తప్పిదాలు జరుగుతుంటాయి. కానీ, నువ్వు ఉన్నతంగా మాట్లాడి ఉండాల్సింది' అని దక్షిణాఫ్రికా కోచ్‌ను కడిగిపారేశాడు గవాస్కర్

కొన్రాడ్ ఏం అన్నాడంటే..?

గువాహటి టెస్టులో దక్షిణాఫ్రికా 260-5 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 288 పరుగులు ఉన్నా.. టీమిండియాను బ్యాటింగ్ ఆడించలేదు సఫారీ కెప్టెన్ తెంబ బవుమా. మూడో రోజు.. నాలుగో రోజు 500 ఆధిక్యం వచ్చా ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారు. ఇంత ఆలస్యంగా డిక్లేర్ చేశారు ఎందుకు? అనే ప్రశ్నకు కోచ్ కొన్రాడ్ టీమిండియా ఆటగాళ్లను ఎక్కువ సమయం ఫీల్డింగ్ చేయించాలనుకున్నామని చెప్పాడు. మేము త్వరగా డిక్లేర్ చేయాలనుకోలేదు. భారత ఆటగాళ్లను చాలా సేపు ఫీల్డించ్ చేయించాలని అనుకున్నాం. నిజం చెప్పాలంటే భారత్ మమ్మల్ని ప్రాధేయపడేలా చేయాలనుకున్నాం. టీమిండియాకు మ్యాచ్‌లో ఏమాత్రం అవకాశం ఇవ్వొద్దని భావించాం అన్నాడు. నాలుగో రోజు ఆఖర్లో గంట.. ఐదోరోజు మొత్తం క్రీజులో నిలబడి చూపించండి అని సవాల్ విసరాలనుకున్నాం

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.